ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 19 ఫిబ్రవరి 2025



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా కేటాయింపులు

- ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే సాధ్యం
- చర్చా గోష్ఠిలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రసంగిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

8

ఎండీఎంఏ మత్తులో విద్యార్థులు

- బెంగళూరు నుంచి గుంటూరుకు సరఫరా
- 9 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్టు.. ఇద్దరు పరారీ
- 10.67 గ్రాముల ఎండీఎంఏ సహా, కేజీ గంజాయి స్వాధీనం



మత్తు మందు ప్యాకెట్లు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు


గుంటూరు, ఫిబ్రవరి 18: అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ మత్తు మందుకు విద్యార్థులు బానిసలవుతున్నారు. నిషేధిత మత్తు మందును గుంటూరు కేంద్రంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు నాలుగేళ్లుగా సరఫరా చేస్తున్నారు. గుంటూరులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ మత్తు మందును సరఫరా చేస్తున్న వారిని, దానికి బానిసలైన విద్యార్థులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన ఎం సాయికృష్ణ అనే విద్యార్థి గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతడి సోదరుడితో పాటు తెనాలి సమీపంలోని చినరావూరుకి చెందిన ధరావత్ సతీష్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో గతంలో సాయికృష్ణ అనేక సార్లు బెంగళూరు వెళ్లగా అక్కడ సతీష్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. సతీష్‌కుమార్ అప్పటికే బెంగళూరుకు చెందిన నితిన్ అనే వ్యక్తితో కలిసి ఎండీఎంఏ మత్తుమందును వినియోగిస్తున్నాడు. దీంతో సతీష్ కుమార్ ద్వారా సాయికృష్ణ కూడా ఆ మత్తుకు బానిసయ్యాడు. ఆ మందును గుంటూరులో విక్రయించి సొమ్ము చేసుకోవచ్చని నితిన్ సూచించాడు. దీంతో నితిన్ ద్వారా ఆ మందును నాలుగేళ్లుగా సాయికృష్ణ, సతీష్‌కుమార్ గుంటూరు తెచ్చి ఇంజనీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల కోదండ రామానగర్‌లోని సాయిలక్ష్మీ అపార్ట్మెంట్లో ఉంటూ మత్తు మందును విద్యార్థులకు విక్రయిస్తు న్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం రోడ్డులో ఎక్సైజ్ టూ టౌన్ సీఐ యశోదరాదేవి సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గుడి పక్కన ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు అధికారులను చూసి గాబరాపడుతుండగా అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. 2.52 గ్రాముల ఎండీఎంఏ మత్తు మందును వారి వద్ద గుర్తించారు. ఆ మందును అమ్ముకోవడానికి తాము వచ్చినట్లు విచారణలో ఎక్సైజ్ అధికారులకు వారు చెప్పారు. సాయి కృష్ణ వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఎక్సైజ్ అధికారులు అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేపట్టగా 8.15 గ్రాముల మత్తుమందుతోపాటు, కేజీ గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు లభించాయి. ఫ్లాట్‌లో సాయికృష్ణతో ఉన్న ఏడుగురు విద్యార్థులను కూడా గుర్తించారు. చెరుకుల కృష్ణారెడ్డి(జాకీర్‌హుస్సేన్ నగర్), రాచభత్తుని రాహుల్ (శివనాగరాజుకాలనీ), దొంత ప్రవీణ్ అలియాస్ మమ్మీ(ఆదర్శనగర్), అందే లోకేశ్(పట్టాభిపురం), కొప్పుల ప్రద్యుమ్న(రెడ్డిపాలెం), ములబంటి సాయికృష్ణ(కాజ), ధరావత్ సతీష్‌కుమార్ (చిన్న రావూరు), మద్దిబోయిన దొరస్వామి రాజు(యడ్లపాడు మండలం కొత్త పాలెం), విష్ణుమొలకల చైతన్య (కారంపూడి మండలం లక్ష్మీపురం) అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉండగా 9 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సాయికృష్ణ బంధువు వేంపాటి చైతన్య, బెంగళూరుకు చెందిన నితిన్‌లను అరెస్టు చేయాల్సి ఉంది. ప్రమాదకరమైన మత్తుమందు కేసును ఛేదించిన టూ టౌన్ ఎక్సైజ్ సీఐ ఎం యశోదరా దేవిని డీసీ డాక్టర్ శ్రీనివాసులు అభినందించారు. గత నెలలో కొకైన్ కేసును కూడా సీఐ ఛేదించారన్నారు. ఎస్‌ఐలు సత్యనారాయణ, మాధవి, హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతరావు, సీహెచ్ రాజు, షైలా శ్రీనివాసరావు, రవిబాబు, బీఎస్ఎన్ రాజు, పీ నాగేశ్వరరావు, ఎం సూర్యనారాయణ, వీవీ చారి చిన్నబాబు తదితరులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి వీ అరుణకుమారి, ఏఈఎస్ ఈడే మారయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రాము రూ.5వేలకు విక్రయం..

బెంగళూరులో ఎండీఎంఏ మత్తుమందును గ్రాము రూ.1400 కొనుగోలు చేసి రూ4,000 నుంచి 5 వేలకు అమ్ముతున్నారు. గుంటూరు సమీపంలోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలోని కొందరు విద్యార్థులకు ఈ మందును సాయికృష్ణ అలవాటు చేశాడు. గోరంట్లలోని తన ఫ్లాట్‌కి విద్యార్థులను పిలిపించుకుని మత్తు మందును విద్యార్థులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నాడు. నాలుగేళ్లుగా సాయికృష్ణ ఈ వ్యాపారం చేస్తున్నాడు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి తన స్వగ్రామానికి చెందిన సమీప బంధువు ద్వారా విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

అత్యంత ప్రమాదకరం

బ్రౌన్‌షుగర్, కొకైన్.. వంటి మత్తు మందులకంటే ఎండీఎంఏ అత్యంత ప్రమాదకరమైందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మత్తు మందుకు బానిసైన వారిలో నరాల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఆలోచనలు, విచక్షణ కోల్పోతారన్నారు. ఆకలి, నిద్ర ఉండదన్నారు. ఈ మందుకు బానిసైన వారు నగదు కోసం ఎంతటి అఘాయిత్యానికైనా పాల్పడతారన్నారు.



పల్లెలు.. పట్టణాల్లో శాశ్వతంగా తాగునీటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. వాటర్ గ్రిడ్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కసరత్తు చేపట్టింది. అయితే వాటర్‌గ్రిడ్ అనుసంధానం అన్ని పట్టణాలకు సాధ్యం కాదని కొన్నింటికే పరిమితం చేస్తూ అధికారులు తేల్చారు. గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలు వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం సాధ్యం కాదని తేల్చేశారు. 2058 నాటికి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు గుంటూరు, బాపట్ల పరిధిలోని మున్సిపాల్టీల వారీగా నీటి అవసరాలకు సంబంధించిన నివేదికను ఆర్‌డబ్ల్యూ ఎస్ ఇంజనీర్లకు పబ్లిక్ హెల్త్ అధికారులు అందజేశారు. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసిన సదరు ఇంజనీర్లు కొన్ని మున్సిపాల్టీలనే వాటర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. గ్రిడ్ వ్యయ అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. త్వరలో సీఎం చంద్రబాబునాయుడు వాటర్ గ్రిడ్‌పై సమీక్షిస్తారని సదరు అధికారులు తెలిపారు.

వాటర్ గ్రిడ్.. కొన్ని పట్టణాలకే

కొన్ని మున్సిపాలిటీలకే అనుసంధానం

- 2058కి 731.51 ఎంఎల్‌డీ నీరు అవసరం
- ఆర్‌డబ్ల్యుఎస్‌కు నివేదిక అందజేసిన పబ్లిక్‌హెల్త్
- గుంటూరు సహా పల్నాడులోని పట్టణాలకు అసాధ్యం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చేందుకు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గ్రిడ్ పథకాన్ని తొలి విడత పల్నాడు జిల్లాలో అమలు చేసేందుకు రూ.1,200 కోట్లతో గతంలో టెండర్ ప్రక్రియను కూడా నిర్వహించారు. టెండర్ ఆమోదించి పనులు చేపట్టే తరుణంలో మున్సిపాల్టీలకు కూడా ఈ పథకాన్ని అనుసంధానం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేసే అంశంలో గత వారం రోజులుగా జరుగుతున్న కసరత్తు ఒక కొలిక్కి వచ్చింది. ఏమున్సిపాల్టీలకు సాధ్యం.. ఏఏ మున్సిపాల్టీలకు సాధ్యం కాదన్న అంశాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు తేల్చేశారు. ఇందుకు సంబంధించి అంచనా వ్యయం రూపొందిస్తున్నారు.

అయితే గుంటూరు కార్పొరేషన్‌తో పాటు పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం సాధ్యం కాదని అధికారులు నిర్ధారించారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, దాచేపల్లి, మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల మున్సిపాల్టీలకు వాటర్‌గ్రిడ్ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు.

ఆ మున్సిపాలిటీల్లో.. అమృత్ 2.0

పల్నాడు జిల్లాలోని గ్రామాలకు వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు టెండర్ నిర్వహించారు. ఈ పనులు త్వరతగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్న తరుణంలో మున్సిపాలిటీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం అంశం తెరపైకి వచ్చింది. అయితే పల్నాడు జిల్లాలోని మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ సాధ్యం కాదని అధికారులు తేల్చారు. దీంతో ఆయా మున్సిపాల్టీల్లోని నీటి పథకాలను అమృత్ 2.0 కింద విస్తరించనున్నారు. గుంటూరు కార్పొరేషన్‌కు ఉన్న నీటి పథకాన్ని కూడా అమృత్ కింద విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ 2.0 పనులకు సంబంధించిన డీపీఆర్‌లను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే.

ప్రకాశం బ్యారేజి వద్ద ప్లాంట్

వాటర్‌గ్రిడ్‌తో అనుసంధానం చేసి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ప్రకాశం బ్యారేజి సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు జిల్లా పరిధిలోని మంగళగిరి - తాడేపల్లి, పొన్నూరు, తెనాలి మున్సిపాల్టీలకు వాటర్ గ్రిడ్ అనుసంధానం చేయవచ్చని అధికారులు నిర్ధారించారు. బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాల్టీలకు నీటిని సరఫరా చేయవచ్చని తేల్చారు. ప్రకాశం బ్యారేజ్ సమీపంలో ఏర్పాటు చేసే నీటి శుద్ధి ప్లాంట్ నుంచి గ్రామాలకు, మున్సి పాల్టీలకు తాగునీటిని సరఫరా చేసే దిశగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

మునిసిపాల్టీల వారీగా రానున్న 33 ఏళ్లలో నీటి అవసరాల అంచనా వివరాలు

మునిసిపాల్టీ	ప్రస్తుత నీటి సరఫరా ఎంఎల్‌డీ	2058 నాటికి నీటి అవసరం ఎంఎల్‌డీ
పల్నాడు జిల్లా..		
నరసరావుపేట	22	40.9
చిలకలూరిపేట	16	31.78
వినుకొండ	7	16.94
దాచేపల్లి	2.5	10.99
పిడుగురాళ్ల	9.78	19.63
గురజాల	2	8.74
మాచర్ల	6	17.69
సత్తెనపల్లి	9	17.59
గుంటూరు జిల్లా..		
గుంటూరు	157.2	296.74
మంగళగిరి.. తాడేపల్లి	22.5	98.28
తెనాలి	20	53.87
పొన్నూరు	7.45	18.8
బాపట్ల జిల్లా..		
చీరాల	10	28.07
బాపట్ల	10	24.57
రేపల్లె	4	15.24
అద్దంకి	2.74	13.68

ఆ వెంచర్లకు అనుమతి లేదు

- నరసరావుపేటలో 13 లే అవుట్ల గుర్తింపు
- అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ అధికారులు కొరడా
- రిజిస్ట్రేషన్ నిలిపివేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మున్సిపాల్టీ పరిధిలోని అక్రమ లే అవుట్లపై అధికారులు కొరడా ఝుళిపించారు. ఆ లే అవుట్లలో రిజిస్ట్రేషన్లను కూడా నిలిపివేశారు. ప్రణాళికా విభాగం డైరెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. మున్సిపాల్టీ పరిధిలో 13 అక్రమ లేఅవుట్లను గుర్తించి నిర్వాహకులకు మున్సిపాల్టీ నోటీసులు జారీ చేసింది. నోటీసులకు స్థిరాస్తి వ్యాపారులు స్పందించని నేపథ్యంలో చర్యలపై రిజిస్ట్రేషన్ శాఖకు మున్సిపల్ కమిషనర్ లేఖ రాశారు. మున్సిపాల్టీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్ల జాబితాను రిజిస్ట్రేషన్ శాఖకు పంపింది. దీనిపై స్పందించిన జిల్లా రిజిస్ట్రార్ చర్యలు చేపట్టారు. సత్తెనపల్లి రోడ్డులోని సర్వే నెంబరు 63లో 5.60 ఎకరాలు, 34లో 1.38 ఎకరాలు, ఎస్ఆర్‌కేటీ కాలనీ ప్రాంతంలోని 269లో 5.10 ఎకరాలు, 270, 275 లో 12.30 ఎకరాలు, 289లో 7.19 ఎకరాలు, కోటప్ప కొండ రోడ్డులోని 288, 290లో 14.20 ఎకరాలు, 303, 306లో 12.52 ఎకరాలు, 277లో 4.45 ఎకరాలు, వల్లప్ప చెరువు ప్రాంతం లో ని 493, 494లో 5.25 ఎకరాలు, 495లో 3.45 ఎకరాలు, 498/బీ1లో 3 ఎకరాలు, గుంటూరురోడ్డులోని 2/1 సర్వే నెంబర్‌లోని మూడెకరాల్లోని వెంచర్లు రిజి స్ట్రేషన్ నిలుపుదల చేసిన జాబితాలో ఉన్నాయి. దీంతో స్థిరాస్తి వ్యాపారులు కంగుతిన్నారు. ఇప్పటికే ఈ వెం చర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెం దుతున్నారు. సదరు లే అవుట్లలో రిజిస్ట్రేషన్లు నిలుపు దల చేస్తున్నట్లు మున్సిపాల్టీకి రిజిస్ట్రేషన్ శాఖ నుంచి వివరాలు అందాయని కమిషనర్ జస్వంత్ చెప్పారు.

కృష్ణబాబు చెబితే మాకేంటి!

- ఆరోగ్య శాఖలో అడ్డగోలు డిప్యుటేషన్లు
- ప్రిన్సిపల్ సెక్రటరి ఆదేశాలకు పాతర
- పని ఉన్న చోట నుంచి తెచ్చి పని లేని చోట ఉద్యోగం
- వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వారికి అదే చోట పోస్టింగ్

8

కొండవీడు కోట అభివృద్ధికి కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి కట్టడాల పరిశీలన

ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ఎంఏ తెలుగు పరీక్ష ఫలితాలు విడుదల

6

విద్యార్థులకు.. ముఖహాజరు

బీసీ వసతి గృహాల్లో అమలుకు ఆదేశాలు

- సాంకేతికతతో బోగస్ హాజరు నియంత్రణ
- హాస్టళ్లకు సంబంధించిన బిల్లులు యాప్‌కు అనుసంధానం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లేక పోయినా ఉన్నట్లుగా.. వారు భోజనం చేయకపోయినా చేసినట్లుగా.. ఇతర పథకాల ద్వారా లబ్ధి చేకూర్చినట్లుగా.. ఇలా అనేక వసతిగృహాల్లో పెద్దసంఖ్యలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇక నుంచి ఇలాంటి అక్రమాలను అడ్డుకు నేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధమైంది. బోగస్ హాజరును నివారిస్తే అక్రమాలకు చెక్ పడినట్లేనని ఆ దిశగా ప్రభుత్వం చర్యలకు ఆదేశించింది. ఈ క్రమంలో తొలుత బీసీ సంక్షేమ వసతిగృహాల్లో బోగస్ హాజరు నివారణకు నూతన సాంకేతిక విధానం అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మాత్రమే అమలు చేసిన ముఖ హాజరు(ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్)ను ఇక నుంచి బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు అమలు చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి ప్రత్యేక యాప్ ద్వారా నూతన హాజరు విధానాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా దాదాపు 90శాతం పైగా సరైన హాజరు వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు(3 నుంచి 10వ తరగతి వరకు) 65పైగా, కళాశాల స్థాయి విద్యార్థులకు 36 వరకు హాస్టల్స్ ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 7 వేలమందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు.



ఫోన్‌లో యాప్ ద్వారా ముఖ హాజరు తీసుకుంటున్న సిబ్బంది

బయోమెట్రిక్‌లోనూ.. బోగస్ హాజరు

బీసీ వసతిగృహాల్లో గతంలో విద్యార్థులకు బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు తీసుకున్నారు. ఇందులో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. అనేక హాస్టళ్లలో బయోమెట్రిక్ యంత్రాల ద్వారా సైతం బోగస్ హాజరు నమోదు చేసినట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. గతంలో విజిలెన్స్ అధికారులు చేసిన దాడుల్లో బోగస్ హాజరు బహిర్గతమైంది. ఈ నేపథ్యంలో ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈవిధానాన్ని ఎంపిక చేసిన వసతిగృహాల్లో అమలు చేశారు. అది విజయవంతం కావడంతో అన్ని వసతి గృహాల్లోనూ ఫిబ్రవరి 1 నుంచి అమలు చేస్తున్నారు.

ఇక పక్కాగా లబ్ధి

బీసీ వసతిగృహాల్లోని పేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే లబ్ధి పక్కాగా అందనున్నది. ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా తీసిన ఫొటోను ఏపీనివాస్ యాప్‌లో నమోదు చేస్తారు. అందులో విద్యార్థి చదువు, ఎక్కడ నివాసం ఉంటున్నాడు.. తదితర వివరాలు నిక్షిప్తం అవుతాయి. ఈ విధానం ద్వారానే విద్యార్థుల మెస్ బిల్లులు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల ఎటువంటి అక్రమాలకు అస్కారం ఉండదని అధికారులు చెబుతున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని అన్ని బీసీ హాస్టళ్లలో ఈ నెల ఒకటి నుంచి ముఖ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నట్లు సంక్షేమశాఖాధికారి మయూరి తెలిపారు. మెస్ సహా ఇతర అన్ని బిల్లులు దీనికి అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలలోపు హాజరు పూర్తి చేసి వివరాలను వెల్ఫేర్ ఆఫీసర్లు యాప్‌లో అప్‌లోడ చేయాల్సి ఉంటుందన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు మంగళవారం కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. జిల్లాలోని 463 పాఠశాలల నుంచి 26,497 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా 128 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉప, మండల విద్యాశాఖాధికారులు సంబంధిత తహసీల్దార్ల సహకారంతో పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఆహ్లాద వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గుంటూరు పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకుడు లింగేశ్వరరెడ్డి, జిల్లా ప్రభుత్వ పరీక్షల పరిశీలకురాలు, జేడీ ఎస్.గీత, డీఈవో ఎల్.చంద్రకళ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కేఎంఏ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్
● ఎమ్మెల్యే జూలకంటితో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కారంపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరుజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావంతుడు, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం పట్టణంలో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, వ్యవసాయదారులు, పారిశ్రామికవేత్తలు ఎన్నో కష్టాలు పడి నష్టపోయారని, ఆ భయంతోనే కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు ఇచ్చి ప్రజలు వైసీపీపై తమ వ్యతిరేకతను నిరూపించుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాశనం చేసిన పోలవరం ప్రాజెక్ట్‌ను, రాజధాని అమరావతిని గాడిలో పెట్టి పనులు ప్రారంభింపజేశామని, వీటన్నిటి కోసం 75 యేళ్ల వయసులో 25 యేళ్ల కుర్రవాడిగా పనిచేస్తూ సీఎం చంద్రబాబునాయుడు తమకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో తమ పెట్టుబడుల ద్వారా పరిశ్రమలు నెలకొల్పనున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తక్కువ కాలంలోనే రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిందని మంత్రి రవికుమార్ అన్నారు. మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ 8 నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కూటమిపై ఎంతో నమ్మకముంచి అఖండ మెజార్టీతో కూటమని గెలిపించారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను, అప్పులను, విధ్వంసాలను పూర్తిగా గ్రహించడానికి నాలుగు నెలలు పట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలను కొనసాగిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సభకు ముందుగా తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


మాట్లాడుతున్న మంత్రి రవికుమార్, పక్కన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


బంగారు రుద్రాక్షమాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న చంద్ర శ్రీనివాసరావు, చిత్రంలో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు

త్రికోటేశ్వరునికి రూ.20 లక్షల విలువైన బంగారు రుద్రాక్షమాల సమర్పణ

చిలకలూరిపేట,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వరునికి చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన, హైదారాబాద్ గోకుల్ కన్‌స్ట్రక్షన్ అధినేత చంద్ర శ్రీనివాసరావు రూ. 20 లక్షల విలువైన బంగారు పంచముఖ రుద్రాక్షమాలను మంగళవారం సమర్పించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు సమక్షంలో ఆయన ఆ రుద్రాక్షమాలను ఆలయ కమిటి వారికి అందచేశారు.



ఉద్యోగావకాశాలు

➡ గుంటూరులోని మయూరి బార్ & రెస్టారెంట్లో Part/Full టైం పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్లు, వెయిటర్లు కావలెను. రూం+భోజన వసతి కలదు. సంప్ర॥ 7075338338, 8143198968.
AJG-204378

➡ జయలక్ష్మి హోండా టూ వీలర్ షోరూం గుంటూరు నందు పనిచేయుటకు Male సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ అడ్వైజర్స్, అకౌంటెంట్స్, మెకానిక్స్, హెల్పర్స్ కావలెను. సంప్ర॥ 96144 55555.
AAA-9922

➡ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ MARAM VENKATAREDDY INFRA, గుంటూరు మరియు ఒంగోలు నందు పనిచేయుటకు MARKETING DIRECTORS, GENERAL MANAGERS, ASST GENERAL MANAGERS, DIGITAL MARKETING PERSONS మరియు ACCOUNTANTS కావలెను (అనుభవం కలిగిన వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వబడును) సంప్రదించవలసిన నెంబరు : 9515980476, 8074432717
AJG-210366

➡ గుంటూరు, పేరేచర్ల పరిసర ప్రాంతాలలోని ప్రముఖ టొబాకో కంపెనీలు మరియు ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో మా సంస్థ అయిన సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్ తరుపున పనిచేయుటకు అనుభవం ఉన్న సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్ వైజర్స్ అర్హతలు : 30-45 సం॥, ఇంటర్ / డిగ్రీ, ఎత్తు: 05'-06'' పైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలటరీ వారికి ప్రాధాన్యత, గార్డ్ అర్హతలు : 23-45 సం॥, 10th, ఎత్తు: 05'-05'' పైన, లేబర్ యాక్ట్ ప్రకారం జీతం. ఆసక్తి గల వారు ఉ॥ 11 గం.ల నుండి మీ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సంప్ర॥ బృందావన్ గార్డెన్స్, SBI ప్రక్కన, గుంటూరు. సెల్ : 70951 25556, 0863-2951838.
NAM-380

➡ Jobs in Malaysia Where House, Factory, Hospitals, Supermarket, Workers Salary 40K. Process Time 30 days Cell : 98496 42038
AJB-1354

జ్యోతిష్యాలయం

➡ ఓం, శ్రీ గాయత్రీ దేవి జ్యోతిష్యాలయం పండిత్ V.R.జోషి గారు ఫోన్ ద్వారా మీ అనేక సమస్యలకు పరిష్కారం చెప్పగలరు. స్త్రీ పురుషులకు ఎటువంటి సమస్యలు ఉన్న ఫోన్ ద్వారా పరిష్కారం మార్గం చెప్పబడును. సెల్: 7702216858
AJO-211378

అమ్మకము

➡ గుంటూరు, పట్టాభిపురం రైల్వే DRM ఆఫీస్ రోడ్, 5 ఫ్లోర్స్ క్లియర్ టైటిల్ కమర్షియల్ బిల్డింగ్ (110 Sq.Yards_) అమ్మకానికి కలదు. నెలకు 70,000/- వరకు అద్దెలు రావచ్చు. సంప్ర॥ 93953 61925
AJG-210295

➡ గుంటూరు, VIP రోడ్ (భవానీపురం కాలనీ), 40 Feets రోడ్డు వెంచర్‌లో, 120 చ॥గ॥, న్యూ కన్‌స్ట్రక్షన్ G+1, 2BHK, వెస్ట్ ఫేసింగ్, 3 కార్ పార్కింగ్ గల ఇల్లు అమ్మకానికి కలదు. 70L. నో బ్రోకర్స్. సంప్ర॥ 98483 31042
AJG-210364

రియల్ ఎస్టేట్

➡ గుంటూరు మున్సిపాలిటీ పరిధిలోని ఉన్నటువంటి లాలుపురం, బుడంపాడు ప్రాంతంలో నివాసవంతమైన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు సంప్రదించండి : 99591 27008
AJG-210365

ఇల్లు అమ్మకము

➡ సత్తెనపల్లి, పాత పోస్ట్ ఆఫీస్ రోడ్డు, గణేష్ మెస్ ఎదురు 510 చ.గ.ల ఇల్లు SBI ఈ - వేలం ద్వారా అమ్మకం. ఆక్షన్ తేదీ : 20.02.2025, రిజర్వు ధర : 2 కోట్ల 58 లక్షలు. సంప్ర॥ 93475 44565
AAA-9914

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368
AJB-225797

అద్దెకు

➡ గుంటూరు, గుజ్జనగుండ్ల జెకెసి నగర్‌లో 3300 SFT each floor single flat డాక్టర్స్ & రిచ్ ఫ్యామిలీస్‌కు అనువైనది అమ్మకానికి కలదు. ఫోన్ : 81424 15999
KM-1264

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!



ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొన్నట్టయితే నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ల	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	98852 71281
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్: 99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

రాజకీయ సన్యాసంపై కాసు కట్టుబడి ఉండాలి

● నీతి, విలువలపై ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదం
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన ఎన్నికల సమయంలో ఈ ఎన్నికలలో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న మాటలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కట్టుబడివుండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 2019-24 మధ్య రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా గురజాల నియోజకవర్గంలోనూ అరాచకాలు, విధ్వంసాలకు పాల్పడ్డారని, 1వ తేదీన పింఛన్, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితి వుందని, రోడ్లపై గుంతలు పూడ్చలేని స్థితి నుంచి ఇప్పుడిప్పుడే రాష్ట్రం ప్రగతి పట్టాలపైకి ఎక్కుతుందన్నారు. ఏడు నెలల కాలంలో రాష్ట్రంలో అనేక పెట్టుబడులకు చంద్రబాబుపై వున్న నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత కాసు మహేష్ రెడ్డికి లేదని, గత మున్సిపల్ ఎన్నికల సమయంలో నామినేషన్లు కూడా వేయనీయకుండా, అధికారుల కళ్లెదుటే నామినేషన్ పత్రాలను చించివేసినా స్పందించని అధికారులు కాసు మహేష్‌రెడ్డి నేడు స్వచ్ఛందంగా 17 మంది కౌన్సిలర్లు పార్టీ మారటంపై మాట్లాడటం సిగ్గుచేటుగా వుందన్నారు. కౌన్సిలర్లే స్వచ్ఛందంగా పార్టీ మారుతున్నట్లు, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో కూడా అధికారులు నిబంధనల ప్రకారమే పని చేశారని, ఆ విధంగానే వీడియోలోనూ ఆధారాలు వున్నాయన్నారు. పిడుగురాళ్ల మునిసిపాలిటీలో అధికార మార్పు, కూటమి ప్రభుత్వంపై జగన్ వ్యాఖ్యలకు ఎమ్మెల్యే యరపతినేని ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అభివృద్ధి కోసమే కౌన్సిలర్లు టీడీపీలోకి చేరినట్లు స్వచ్ఛందంగా ప్రకటించాక మాట్లాడటం అర్థం పర్థం లేనిదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కూటమి నేతలు, కార్య కర్తలు సంయమనం పాటిస్తూ ఇటువంటి రాజకీయ గొడవలు, అక్రమ కేసులు, దాడులకు పాల్పడటం లేదని తెలిపారు. వైసీపీ హయాంలో పింఛన్లు రాజకీయం చేశారని, పథకాలను తీసివేశారన్నారు. నేడు అలా కాకుండా అర్హులైన వారందరికీ పింఛన్లు, ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామన్నారు. సమావేశంలో పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, వున్నం సురేష్, కామిశెట్టి రమేష్, పిల్లి చెన్నారావు, దూదేకుల ఖాశింసైదా, చావా రామారావు, ఎల్‌విఆర్, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం ఆంజనేయులు, మందా డేవిడ్, ఇతర నేతలు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని

పరిశోధనలతో పాటు ఉపాధి అవకాశాలు

● బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల శాస్త్రవేత్తల బృంద సభ్యుల వెల్లడి
● వర్సిటీలో వృక్ష, జంతు, సూక్ష్మజీవ శాస్త్ర విభాగాల సందర్శన


బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్ర విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు అనంతరం బొటానికల్, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థల్లో పరిశోధనతోపాటు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆయా సంస్థల శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ శంకర్రావు, జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ దీప జైశవల్, డాక్టర్ రాజమోహన్ సందర్శించారు. వర్సిటీలోని వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రం, ఫారెస్ట్రీ, జంతుశాస్త్ర విభాగాలను సందర్శించి విద్యార్థులతో సమావేశమై పలు విషయాలను చర్చించారు. అనంతరం విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జునతో సమావేశమై పశ్చిమ కనుమలు, మడ అడవులలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం ఇన్‌చార్జివీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలను మర్యాదపూర్వకంగా కలిశారు. బయో డైవర్సిటీ నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని గూర్చి తెలియజేశారు. ఈ సమావేశానికి అనుమతి ఇచ్చినందుకు గాను వర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డుతో అవగాహన ఒప్పందం చేసుకునేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. కార్యక్రమంలో ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య రామచంద్రన్, ఆచార్య వెంకట రత్నమ్మ, ఆచార్య ఉమా మహేశ్వరరావు, ఆచార్య ఎస్ఎం ఖాసిం, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కె.బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ మిథున్, డాక్టర్ బాలరాజు, డాక్టర్‌విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొండవీడు కోట అభివృద్ధికి కృషి

● మంత్రి గొట్టిపాటి రవికుమార్
●ఎమ్మెల్యే పుల్లారావుతో కలిసి కట్టడాల పరిశీలన


నటుడు శివాజీని సత్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కొండవీడుకోట అభివృద్ధి కృషి చేస్తామని, దీనిపై త్వరలోనే సీఎంతో చర్చిస్తానని విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలసి ఆయన కొండవీడుకోటను సందర్శించారు. ముందుగా కొండపై ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం చారిత్రక కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సినిమా చిత్రీకరణ చేస్తున్న నటుడు శివాజీని, చిత్ర యూనిట్‌ను కలసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవీడు పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఈ ప్రాంతంలో సినిమాల చిత్రీకరణ పెద్ద ఎత్తున జరగాలన్నారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు.. ఎమ్మెల్యే ప్రత్తిపాటి

టెంపుల్ టూరిజం అభివృద్ధికి అత్యధిక అవకాశాలున్న ప్రాంతం కొండవీడు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి అన్నారు. టీడీపీ ప్రభుత్వ హాయాంలోనే ఘాట్‌రోడ్డు నిర్మాణం జరిగిందని, దాంతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయన్నారు. . కొండవీడుకోట గొప్పతనం ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దుతామన్నారు. ప్రాంతానికి చెందిన నటుడు శివాజీ చారిత్రక కొండవీడుకోటలో చిత్రనిర్మాణం చేపట్టి గుర్తింపు తీసుకు రావడం ఎంతో అభినందనీయమన్నారు. మరిన్ని చిత్రాలు ఇక్కడ షూటింగ్ జరుపుకునేలా ప్రోత్సహిస్తామన్నారు.

కొండవీడు విశేషాలు తెలియజేయాలనే.. నటుడు శివాజి

స్థానిక ప్రతిభను ప్రోత్సహించేందుకు, కొండవీడు విశేషాలను ప్రజలకు తెలియచేసేందుకు ఇక్కడ షూటింగ్ చేస్తున్నట్లు అందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందని సినీ నటుడు శివాజీ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలపై నీతి ఆయోగ్ బృందం తనిఖీలు

శావల్యాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు రాష్ట్రంలో అమలవుతున్న తీరును తనిఖీ చేసేందుకు గానూ కేంద్ర నీతి ఆయోగ్ బృందం సభ్యులు మంగళవారం శావల్యాపురం మండలంలోని బొందిలిపాలెం, శానంపూడి గ్రామ పంచాయతీలలో పర్యటించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. బొందిలిపాలెం పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు చేస్తున్న ఉపాధి పనులను నీతి ఆయోగ్ బృందం సభ్యుడు వికాస్ మాలేకర్ పరిశీలించారు. ఒక్కో కుటుంబానికి ఎన్ని పని దినాలను కల్పిస్తున్నారని, రోజుకు ఎన్ని గంటలు పని చేస్తున్నారని, ఎంత వేతనం తీసుకొంటున్నారని, గ్రామంలో ఉపాది హామీ పనులను ఎవరు పర్యవేక్షణ చేస్తున్నారని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శానంపూడిలోని సచివాలయంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన, సామాజిక పింఛన్‌లు, డ్వాక్రా సంఘాలకు అందిస్తున్న పథకాల అమలు తీరును లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఆరా తీశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొంటున్న తీరు, కుటుంబ పోషణ తదితర అంశాలను గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైస్ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, గంటవారిపాలెం డీసీచైర్మన్ మందలపు వెంకటనారాయణ, బృంద సభ్యులు సంధ్యారాణి, లక్ష్మీ, భాను, చంద్ర, లోకేష్, సంధ్యారాణి, ఎంపీడీవో సీతారామయ్య, ఏపీవో రామారావు, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రసూల్ పాల్గొన్నారు.


బొందిలిపాలెంలో ఉపాధి కూలీలో మాట్లాడుతున్న బృంద సభ్యులు

హ్యాండ్ బాల్ పోటీల విజేత తెనాలి ఎన్ఆర్‌కే కళాశాల

పెదకాకాని, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ వాలీ పోటీల ఫైనల్ మ్యాచ్‌లో తెనాలిలోని ఎన్ఆర్ కే అండ్ కేఎస్ఆర్ గుప్తా కళాశాల మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల నిలువగా, మూడవ స్థానంలో రేపల్లెలోని ఏబీఆర్ ప్రభుత్వ కళాశాల నిలిచినట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి బి. అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విజేత జట్ల క్రీడాకారులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ విశ్వవిద్యాలయ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించి వర్సిటీ ప్రతిష్టను పెంచాలని కోరారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇచ్చే యూనివర్సిటీగా ఏఎన్‌యూ ఎదగాలని ఆకాంక్షించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00


విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ఆచార్య సుబ్బారావు

బీ ఫార్మసీ పరీక్షలు ప్రారంభం

● కేంద్రాలలో సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు తనిఖీ
● మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచన

పెదకాకాని, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో బీ.ఫార్మసీ 4/4 ఏడవ సెమిస్టర్ (రెగ్యులర్), 3/4 ఆరవ సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్షలు పటిష్ట ఏర్పాట్లు మధ్య మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు, ప్రకాశం జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏడవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆరవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం పీజీ అండ్ ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల పరీక్షా కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరిటెండెంట్‌లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో 24 మంది విద్యార్థులకు ఇద్దరు చొప్పున ఇన్విజిలేటర్లు ఉండేలా చూడాలన్నారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహిం చేందుకుగానూ పరిశీలకులను, తనిఖీకి స్క్వాడ్ బృందాలను నియమించామని ఆచార్య సుబ్బారావు తెలిపారు.

జగన్‌కు జైళ్ల పరామర్శలే బాగున్నట్లుంది

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శ

వినుకొండటౌన్ ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు రాకుండా కుంటిసాకులు చెప్పే మాజీ సీఎం వైఎస్ జగన్‌కు జైళ్ల పరామర్శలే బాగున్నట్లుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. మంగళవారం ఉదయం వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నరసరావుపేట రోడ్డులోని సాయిబాబా గుడి వాకింగ్‌ట్రాక్ వద్ద ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని కూటమి అభ్యర్థి డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాలని పట్టభద్రులను కోరారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే అసెంబ్లీకి రాకుండా జైళ్లు పట్టుకొని తిరుగుతున్నాడని అన్నారు. 151 నుంచి 11కి తీసుకువచ్చి ప్రజలు ఎప్పుడో వైసీపీని రోడ్డు మీద నిలబెట్టారన్నారు. జగన్, వైసీపీ నేతల నేర మనస్తత్వాలకు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసు మరో ఉదాహణ అని అన్నారు. వంశీ లాంటి డెకాయిట్లు జైల్లో ఉంటేనే రాష్ట్రంలో శాంతిభద్రతలకు, ప్రజలకు భరోసా ఉంటుందన్నారు. జగన్ సర్టిఫికెట్లుచ్చినంత మాత్రాన హంతకులు రౌడీలు మంచివాళ్లు కారన్నారు. జగన్ తలకిందులుగా తపస్సు చేసినా చచ్చిన రాష్ట్రంలో ఇక వైసీపీ లేవదు, జగన్‌ను జనం నమ్మరని జీవీ స్పష్టం చేశారు.

ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం ఎంఏ తెలుగు పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం 2024 అక్టోబరు, నవంబరులో నిర్వహించిన ఎంఏ తెలుగు 1, 2 ,3 ,4 సెమిస్టర్ పరీక్షల రెగ్యులర్/సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. కోదండపాణి తెలిపారు. ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో ఉంచినట్లు వివరించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.960 చెల్లించి, మార్చి 3వ తేదీలోగా పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి దరఖాస్తు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య వివెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

● ఆఫీసర్స్ క్లబ్ ఆకస్మిక తనిఖీ.. విచారించాలని ఆర్డీవోకు ఆదేశాలు
● జూదం నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరికలు

బాపట్ల,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ పనితీరుపై కలెక్టర్ జె.వెంకటమురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లబ్‌ను జూదం గృహంగా మారితే సహించేదిలేదని హెచ్చరించారు. గతంలో అలాంటి పరిస్థితి ఉండేదని ప్రస్తుతం ఆపరిస్థితిలేదని నిర్వాహకులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మంగళవారం ఆఫీసర్స్ క్లబ్‌ను అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ క్లబ్‌లోని అన్ని గదులను నిశితంగా పరిశీలించారు. అక్కడి వాతావరణం చూచి పేకాట (రమ్మీ) ఆడుతున్నారని గ్రహించారు. రమ్మీ ఆడకపోతే ఇక్కడ చేతి రాతతో రాసిన కౌంట్ పుస్తకాలు ఎందుకు ఉన్నాయని నిర్వాహకులను ప్రశ్నించారు? అయితే తాము క్యారమ్స్ మాత్రమే ఆడుతున్నారని నిర్వాహకులు కలెక్టర్‌కు చెప్పే ప్రయత్నం చేశారు. క్లబ్‌లో ఉన్న రమ్మీ ఆడే కౌంటింగ్ పుస్తకాన్ని విసిరేసి కలెక్టర్ సీరియస్ అయ్యారు. రమ్మీ ఆడే పుస్తకాన్ని ఆర్డీవో పి.గ్లోరియాకి వచ్చి విచారణ జరపాలని ఆదేశించారు. గతంలో పరిస్థితి గందరగోళంగా ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని నిర్వాహకులు మరోసారి కలెక్టర్‌కు వివరిస్తున్న సమయంలో కలెక్టర్ మరింతగా కోపం వ్యక్తం చేశారు. జూదం ఆడితే చూస్తూ ఊరుకుంటామనుకుంటున్నారా.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాలు. ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో ధూమపానం చేయటం వంటి ఇబ్బందికరమైన వాతావరణం నెలకొని ఉందని కలెక్టర్ అన్నారు. పోలీసుశాఖ నుంచి వచ్చిన తనకు ఇటువంటి వ్యవహారాలు గురించి తెలియదనుకుంటున్నారని ప్రశ్నించారు? దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పి.గ్లోరియా, మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటిమట్టం మంగళవారం నాటికి 536.80 అడుగులు ఉంది. ఇది 181.72 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000, ఎడమ కాలువ ద్వారా 8108, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,428 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2000 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 32,816 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 13,575 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1,43,296 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,63,393 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,43,296 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. యార్డు ఆవరణలో 68,321 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిర్చి ధరలు ఈ విధంగా ఉన్నాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600
నంబరు. 5	11000	14300
273	10000	12300
341	10000	14000
4884	10000	12800
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	13900
బ్యాడిగి	10000	13700
దేవనూరు డీలక్స్	10000	13000
తాలుకాయలు	4000	7000

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11225 | 99854 01330
99854 01690 | 99854 77867

ఇమామ్, మౌజన్లకు వేతనాల విడుదలపై హర్షం

కారంపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్లకు వేతనాలు విడుదల చేయడంపై స్థానిక అంజుమన్ కమిటీ సభ్యులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఆరు నెలలకు ఒకేసారి వేతనాలు విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు షేక్ బుడేసాహెబ్, ఉపాధ్యక్షుడు షేక్ మోదీన్‌సా, తండా మస్తాన్‌జానీ, షేక్ నన్నేసా, సయ్యద్ బాజీ, బుజ్జి, అగుమ్‌సాహెబ్, కరీముల్లా, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

● **పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో ఇమామ్ మౌజన్‌లకు గౌరవ వేతనాలను కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్ మంగళవారం తెలిపారు.

వైసీపీ అక్రమార్కులతో నిండనున్న జైళ్లు

● జనసేన నేత అంకారావు

గురజాలటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వైసీపీ అక్రమార్కులతో జైళ్లు నిండనున్నాయని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ తీరును వైసీపీ నేతలే అసహ్యించుకుంటున్నారన్నారు. ప్రజలే వైసీపీని 11 పీలికలు చేశారన్నారు. అధికారంలో కోల్పోయినా శాడిజం కోల్పోలేదని అంకారావు మండిపడ్డారు.

నన్ను ఎవరూ కిడ్నాప్ చేయలేదు

ఎస్‌బీఐ గోల్డ్ అప్రైజర్ పూర్ణచంద్రరావు

గురజాలటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని ఎస్‌బీఐ గోల్డ్ అప్రైజర్ చేపూరి పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో పూర్ణచంద్రరావు తన భార్య మాధవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను గతంలో దాచేపల్లి హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు వద్ద రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నానని, కాలక్రమంలో వాటిని తిరిగి చెల్లించానని, మామధ్య ఎటువంటి విబేధాలు లేవని అన్నారు. అయితే తాను ఇతర కారణాలతో హైదరబాద్ వెళ్లానని, తన ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో తన భార్య మాధవి తనను హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు కిడ్నాప్ చేసి ఉంటాడని బావించి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిందని అన్నారు. తననెవరూ కిడ్నాప్ చేయలేదని పూర్ణచంద్రరావు తెలిపారు.

చింతపల్లి మేజరుకు నీరు విడుదల



చింతపల్లి మేజరు కాల్వకు నీరు వస్తున్న దృశ్యం

అచ్చంపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మేజరు కాలువకు మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు నీటిని విడుదల చేసినట్టు ఎన్ఎస్‌పీ ఏఈ చిలుకా భాస్కర్ తెలిపారు. దీని ద్వారా అంబడిపూడి మైనర్, చింతపల్లి మేజరు, చిగురుపాడు సబ్ మైనర్, వేల్పూరు సబ్ మైనర్ పరిధిలోని పొలాలకు నీరు వస్తాయని తెలిపారు. సిబ్బంది తక్కువగా ఉన్నందున రైతులు సహకరించాలని ఏఈ భాస్కర్ కోరారు. నీటి విడుదల సందర్భంగా డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, సాగునీటి సంఘ అధ్యక్షుడు నెల్లూరి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

వ్యాపారుల ఇళ్లలో చోరీ

● 75గ్రాముల బంగారం, రూ.1.50లక్షల నగదు అపహరణ

రెంటచింతల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలోని ఇద్దరు విత్తన వ్యాపారుల గృహాల్లో మంగళవారం వేకువజామున చోరీ జరిగింది. కన్యాక పరమేశ్వరి ఆలయం సమీపంలోని బొడ్రాయి దగ్గర నివాసముంటున్న తాళ్లూరి సాంబశివరావు, ఆరోగ్యనాథుని చర్చి సమీపంలో ఉంటున్న దుర్గి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి గృహాల్లోకి చొరబడి గ్యాస్ కట్టర్ని ఉపయోగించి గ్రిల్స్ తాళాలు కోసి దోచుకెళ్లారు. మంగళవారం వేకువజామున ఈ దొంగతనం జరిగింది. గతంలో విత్తన వ్యాపారం చేసిన తాళ్లూరి సాంబశివరావు, కోటేశ్వరీ దంపతులు ఈనెల 14న హైదరాబాద్ వెళ్లి మంగళవారం ఇంటికి రాగా గ్రిల్స్ తాళాలు పగులకొట్టి బీరువాను తెరిచి రూ.లక్ష నగదును అపహరించుకుపోయారు. ఆదూరి ఇన్నారెడ్డి, రజనీ దంపతులు పుణ్యక్షేత్రమైన వేళాంగిణి మాత దర్శనానికి ఈనెల 14న వెళ్లి మంగళవారం తిరిగి రాగా తాళాలు తీసి ఇనుప బీరువాలోని 75 గ్రాముల బంగారపు ఆభరణాలు, రూ.50వేల నగదును దోచుకుపోయారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ సీహెచ్ నాగార్జున బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిన కుమారుడు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని కుమారుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన కుర్ర యశ్వంత్ పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తల్లి జ్యోతి తన కుమారుడిని మందలించింది. దీంతో తల్లి ఇంట్లో లేని సమయంలో తన దుస్తులు సర్దుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. యశ్వంత్ ఆచూకీ తెలిసినవారు 9989451609కు సమాచారం అందించాలని కుటుంబసభ్యులు కోరారు. కాగా దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 30.93 టీఎంసీల నీటి నిల్వఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

రైతు సేవాకేంద్రాల్లో పనిచేయని కియోస్క్‌లు

● దిష్టి బొమ్మలా మారిన యంత్రాలు
● కోట్లాది ప్రజాధనం దుర్వినియోగం
● సేవలన్నీ ఫోన్‌ల ద్వారానే..



దిష్టి బొమ్మల్లా కియోస్క్ యంత్రాలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగమైంది. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పి రైతుభరోసా కేంద్రాల (ప్రస్తుత రైతుసేవాకేంద్రాల)కు కియోస్క్ యంత్రాలు సరఫరా చేసింది. రాయితీపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన యంత్రాలు రెండు సంవత్సరాలకే మూలకు చేరాయి. ప్రారంభంలో యంత్రాల ద్వారా అరకొర సేవలు అందించిన ఆ తరువాత పెద్దగా వాటిని ఉపయోగించలేదు. ఇంటర్నెట్ సౌకర్యం సరిగా అందక చాలా చోట్ల ఇవి పనిచేయక రైతులు ప్రైవేట్ దుకాణాల బాటపట్టారు. ఇవి అలంకారప్రాయంగా, దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. సత్తెనపల్లి మండలంలో 17, రాజుపాలెం-13, ముప్పాళ్ళ-13, నకరికల్లు -15 కియోస్క్ యంత్రాలు రైతు సేవా కేంద్రాల్లో పడిఉన్నాయి.

నెరవేరని లక్ష్యం


అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే రైతు భరోసా కేంద్రాలకు వచ్చి తమకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అవసరమైన పరిమాణంలో కియోస్క్ యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. తరువాత నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. మార్కెట్‌లో పంట ధరలు, వాతావరణ మార్పులు తదితర విషయాలను రైతులు తెలుసు కొనే సౌలభ్యం ఉంది. అన్నదాతలకు వీటిపై అవగాహన కల్పించకపోవడంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇవి నిరుపయోగంగా మారాయి. 2020 - 21 సంవత్సరాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో యంత్రానికి రూ.80వేలు ఖర్చు చేశారు. 2023 నుంచి ఇవి సక్రమంగా పని చేయటం లేదు.

సేవలన్నీ ఫోన్‌లలోనే

ప్రస్తుం గ్రామస్థాయిలో పనిచేసే వీఏఏలు, ఎంపీవోలు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, ఈ పంట నమోదు తదితర విషయాలు ఫోన్‌ల ద్వారానే నమోదు చేస్తున్నారు. వాతావరణ సమాచారం, మార్కెట్ ధరలు తదితర సేవలన్నీ ఫోన్‌లలోనే తెలుసుకొనే అవకాశం ఉంది. దీంతో యంత్రాలు మూలకు చేరాయి.

ప్రభుత్వానికి తెలియజేస్తాం

- శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, సత్తెనపల్లి



ప్రస్తుతానికి వ్యవసాయానికి సంబంధించిన వ్యవహారాలు సెల్ ఫోన్లలోనే చేస్తున్నారు. కియోస్కో యంత్రాలు గురించి రైతులు తమ దృష్టికి తెస్తున్నారని, ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తాం.

ప్రజాస్వామ్యం గురించి పులివెందుల ఎమ్మెల్యేకు మాట్లాడే హక్కు లేదు

● పిడుగురాళ్ళ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రజాస్వామ్యబద్ధంగా జరిగింది
● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు
● ఆలపాటిని గెలిపించాలని ప్రచారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఘాటుగా సమాధానం ఇచ్చారు. మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నేతలు టీడీపీ అభ్యర్థులను మండలాలు, మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ కూడా వేయనీయకుండా దౌర్జన్యం చేసి ఏకగ్రీవం చేసుకున్నారు. పిడుగురాళ్ళ మున్సిపాలిటీలో టీడీపీ అభ్యర్థులు నామినేషన్‌లు వేయటానికి వెళితే మా టీడీపీ అభ్యర్థులను వైసీపీ వారు ఏ విధంగా అడ్డుకున్నారో వీడియోలు కూడా ఉన్నాయి, నాటి వీడియోలను మీడియాకు కూడా రిలీజ్ చేస్తున్నాం. నిన్న జరిగిన పిడుగురాళ్ళ మున్సిపాలిటీ ఎన్నికలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఎవ్వరినీ అడ్డుకోలేదు. అభివృద్ధి టీడీపీతోనే జరుగుతుందన్న నమ్మకంతో వైసీపీ కౌన్సిలర్లంతా.. చైర్మన్‌తో సహా టీడీపీలో చేరారు. గతంలో గురజాల నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యేకు నేను విసిరిన సవాల్ ప్రకారం గురజాలలో ఓడిపోయిన వ్యక్తి రాజకీయ సన్యాసం తీసుకోవాలంటూ యరపతినేని అన్నారు. .

ప్రతి ఓటరును అభ్యర్థించండి

కృష్ణా గుంటూరు పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరును నేరుగా కలవాలని, అభ్యర్థించాలని ఎమ్మెల్యే యరపతినేని బూత్ ఇన్‌చార్జ్‌లను కోరారు. నారాయణపురం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల బూత్‌లెవల్ కమిటీలతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సీఆర్ రాజన్, గురజాల నియోజకవర్గ పరిశీలకులు కల్లం రాజశేఖరరెడ్డి ఎమ్మెల్యే యరపతినేనితో కలసి సమావేశంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన తురకపాలెం ముస్లింలు

మాచవరం మండలం తురకపాలెంకు చెందిన ముస్లింలు మంగళవారం పట్టణంలోని పంచాయతీ రాజ్ గెస్ట్‌హౌస్‌లో యరపతినేని శ్రీనివాసరావును కలిశారు. 2019లో వైసీపీ ప్రభుత్వంలో గ్రామానికి చెందిన 50 మంది ముస్లింలపై అక్రమంగా కేసులు నమోదు చేశారు. కాగా ఆ కేసును మంగళవారం జిల్లా కోర్టు కొట్టివేసింది. గురజాలలో ఎమ్మెల్యేని కలుసుకొని స్వీట్లు తినిపించారు.

అత్యధిక మెజార్టీతో ఆలపాటిని గెలిపించాలి

గురజాలటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటిని అధిక మెజార్టీతో గెలిపించాలని యరపతినేని శ్రీనివాసరావు కోరా రు. మంగళవారం స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన మండలస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కల్లం రాజశేఖర్‌రెడ్డి, సీఆర్ రాజన్, సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, కటికం అంకారావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● **పిడుగురాళ్ల (ఆంధ్రజ్యోతి):** స్థానికి పార్టీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను నియోజకవర్గంలో మొత్తం 21మందికి రూ.21,07,128 ల చెక్కులను యరపతినేనికి అందజేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



కారంపూడిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణబాబు

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ అరుణబాబు పరిశీలించారు. సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ప్రభుత్వ బాలుర గిరిజన వసతిగృహాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ డీఈ మురళి, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, ఎంఈవో సురేష్ తదితరులు ఉన్నారు.

● **కారంపూడి (ఆంధ్రజ్యోతి):** కారంపూడి పట్టణంలోని బ్రహ్మనాయుడు జడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్, సిబ్బంది ఉన్నారు.


● **దుర్గి (ఆంధ్రజ్యోతి):** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. వసతులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం రీసర్వేలో పాల్గొని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ రీసర్వే విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.

వసతిగృహంలో భోజనం పరిశీలన

మాచర్లటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ క్వారీ ఒడ్డున ఉన్న గిరిజన ఆశ్రమ వసతిగృహాన్ని మంగళవారం రాత్రి కలెక్టర్ అరుణబాబు సందర్శించారు. వసతిగృహంలో భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, ఎంపీడీవో ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యులంతా కలసికట్టుగా ఆలపాటిని గెలిపించాలి

● నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కేకే చౌదరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేకే చౌదరి

అచ్చంపేట, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేసి ఆలపాటి రాజాను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఖాదీ, చిన్న, మధ్య తరగతి కార్పొరేషన్ చైర్మన్, ఎన్నికల పరిశీలకుడు కేకే చౌదరి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షతన బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట మండలాల ఎన్నికల కో-ఆర్డినేటర్లు, టీడీపీ నాయకుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో చౌదరి మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి గ్రామాల్లోని ప్రతిఒక్కరు బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నల్లపాటి రాము, పార్టీ మండల అధ్యక్షుడు ఆశీర్వాదంతో పాటు మద్దిరాల గంగాధర్, ఏపూరి నాగేశ్వరరావు, కోటా అనీల్, నల్లమేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● **పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి) :** ఆలపాటిని గ్రాడ్యుయేట్ ఓటర్లు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కేకే చౌదరి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయానికి అమరావతి, పెదకూరపాడు మండలాలకు చెందిన 30 మంది ఓటర్లకు కో-ఆర్డినేటర్లకు మార్గ నిర్దేశకత్వంపై సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము, నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్‌లు ప్రసంగించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, అమరావతి మండల అధ్యక్షుడు మల్లాది విష్ణు, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ ఎంపీపీ రామగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

దాతలసాయంతో శ్మశాన వాటిక అభివృద్ధి

దాచేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులందరికీ సంయుక్తంగా ఉపయోగపడే శ్మశాన వాటిక అభివృద్ధికి దాతల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కామనూరి అంకమరాజు, టీడీ పీ నాయకులు చెన్నంరాజు కృష్ణంరాజుల ఆధ్వర్యంలో గ్రామానికి చివరగా 12సెంట్ల స్థలాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. గ్రామంలో ఇప్పటివరకు శ్మశాన వాటిక లేదు. గతంలో ఊరికి చివరగా ఖాళీ ఉంటే అక్కడ అంత్యక్రియలు నిర్వహించే వారు. శాశ్వతంగా పరిష్కారాన్ని చేపట్టాలనే లక్ష్యంగా శ్మశాన వాటికను అభివృద్ధి చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి శ్మశాన వాటికలో బోరింగ్, ప్రహరీ, ఇతర మౌళిక వసతులు ఏర్పాటు చేసేందుకు సహకరించాలని, నిధులు మంజూరు చేయాలని కాట్రపాడు గ్రా మస్థులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పని చేయాలి

సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు

నకరికల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, నామ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు కోరారు. మంగళవారం ఎస్పీ కే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై పోలీసు, రవాణా, హైవే అధికారులు దృష్టి సారించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను పరిశీలించారు.

నాడు నిస్సిగ్గుగా దాడులు.. నేడు పసలేని ఆరోపణలా...

పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నాడు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడి మున్సిపల్ ఎన్నికలలో నామినేషన్ ప్రక్రియలో కూడా పాల్గొనకుండా అడ్డుకున్న వైసీపీ నేతలు.. నేడు ప్రజాస్వామ్యం.. రాజకీయ విలువల గురించి మాట్లాడటంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. 2020 మార్చి 2వ వారంలో పిడుగురాళ్ల మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 33 వార్డులకు ఒక్క నామినేషన్ కూడా వేయనీయకుండా అక్రమ కేసులు, గంజాయి కేసులు బనాయిస్తామని బెదిరించడంతో పాటు అనేక అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలకు కొందరు పోలీసులు కూడా చేతులు కలిపారు. 2020 మార్చి 13వ తేదీన పట్టణంలోని 9వ వార్డుకు టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు మున్సిపల్ కార్యాలయానికి వస్తున్న చల్లగుండ్ల సీత చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలు, మరికొన్ని ధ్రువీకరణ పత్రాలను కొందరు వైసీపీ నేతలు చించి కాల్వలో పడవేయడంతో ఆమె నామినేషన్ వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. మున్సిపల్ కార్యాలయం ముందే విధులు నిర్వహిస్తున్న పోలీసులు నోరు మెదపకపోవడం శోచనీయం. పోలీసులు కూడా నాటి ఘటనపై ఫిర్యాదు తీసుకునేందుకు వెనకడుగు వేశారు. అదేవిధంగా మిగిలిన వార్డుల్లో కూడా టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులపై అనేక ఒత్తిళ్లు, అక్రమ కేసులు బూచి చూపి నామి నేషన్ల ప్రక్రియలో కూడా పాల్గొననీయకుండా చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు టీడీపీలో స్వచ్ఛందంగా చేరారు. అలా చేరిన కౌన్సిలర్ల తీరుపై అప్రజాస్వామికంగా పార్టీలో చేరారని, ఎన్నికలు రద్దు చేయాలని వైసీపీ నేతలు మాట్లాడుతున్నారు. దీనిని చూస్తే ఆనాటి చేష్టలకు, మాటలకు.. ఇప్పటి మాటలకు ఎంతో వ్యత్యాసాన్ని గమనిస్తున్న రాజకీయ విశ్లేషకులు, ప్రజలు వైసీపీ నేతల తీరుపై ఇదేమి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధం

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కాశిరెడ్డి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరాశాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన గ్రామాల్లో వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్ కాశిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాచర్ల మండలంలోని అనుపు, వెల్దుర్తి మండలంలోని జెర్రివాగు, దుర్గి మండలంలోని దుర్గి, ధర్మవరం తాగునీటి పథకాలు పనిచేస్తున్నాయని, వాటి పరిధిలోని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేదన్నారు. గతేడాది కంటే ఈ యేడాది భూగర్భ జలాలు అధికంగా ఉండటంతో బోర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గోపాల్‌సింగ్, బాబునాయక్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపేందుకు కృషి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



న్యాయవాదుల సమావేశంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం పట్టణంలో బార్ అసోసియేషన్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను నిర్మూలించేందుకు సీఎం చంద్రబాబు పారిశ్రామికవేత్తలతో నిరంతరం చర్చలు జరుపుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఈనెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజేంద్రప్రసాద్‌కు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు గంగుల శ్రీనివాసరావు, గంధ్రకోట శ్రీనివాసరావు, రంగారావు, కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, కేళం శ్రీనివాసరావు, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యే

కారంపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమాల్లో కుర్రి శివారెడ్డి, మద్దిరాల జ్ఞాని, అక్కయ్య చౌదరి, పంగులూరి పుల్లయ్య, సర్పంచ్ సరస్వతిబాలునాయక్, పలిశెట్టి రాఘవ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూసా రామాంజనేయులు, బీజేపీ నేత హనుమంతురావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంపై జగన్ మాట్లాడడం హాస్యాస్పదం

కారంపూడి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం గురించి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం కారంపూడిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేతలు రెండు ధర్నాలు చేశారన్నారు. అధికంగా విద్యుత్ చార్జీలు పెంచిన వైసీపీ విద్యుత్ చార్జీలపై ధర్నా చేయడం, సాగునీరు అందించేందుకు మేజర్లు అభివృద్ధి చేయని వారు సాగునీటిపై ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సాగర్ టూరిజంను అభివృద్ధి చేయండి

● టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్



బాలాజీకి వినతిపత్రం అందిస్తున్న ధారూనాయక్

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ పరిధిలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ కోరారు. మంగళవారం విజయవాడలోని ఏపీ టూరిజం కార్యాలయంలో బాలాజీని కలిసి పర్యాటక ప్రాంతంలోని పలు సమస్యలను ధారునాయక్ వివరించారు. లాంచీ స్టేషన్, ఎత్తిపోతల, అనుపు ప్రాంతాల్లో సందర్శకులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఏపీలోకి పర్యాటకుల రాకుండా తెలంగాణ ఉద్యోగులు అడ్డుకుంటున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వినతిపత్రం అందించారు. త్వరలోనే పర్యాటక కేంద్రాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని బాలాజీ హామీనిచ్చారని ధారునాయక్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత ముక్కా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మిట్టగుడిపాడు తిరునాళ్ల

రెంటచింతల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ గ్రామంగా పోలీసు రికార్డుల్లోకెక్కిన మిట్టగుడిపాడు గ్రామ తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసింది. శివాలయం, శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామి వార్ల కల్యాణాలను వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భారీసంఖ్యలో జనం వచ్చారు. రాత్రి వేళ టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చాలా సంవత్సరాల తరువాత టీడీపీ శ్రేణుల హవా స్పష్టంగా కనిపించింది

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు

సోమవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి గ్రామానికి చేరుకుని శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పల్నాడు ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకి స్వాగతం పలికిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి, మల్లారెడ్డి తదితరులున్నారు.

విజయవాడ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా షమ్మి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ గ్రేడు - 2 కమిషనర్‌గా పదోన్నతి పొందిన కే షమ్మిని విజయవాడ మున్సిపల్ కార్పోరేషనర్ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

4వ తరగతి ఉద్యోగులకు స్వీపింగ్ విధులు అప్పగించకూడదు

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ రత్నకుమార్

నకరికల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : స్వీపింగ్ విధులు, వాచ్ అండ్ వార్డు విధులను 4వ తరగతి ఉద్యోగులకు అప్పగించకూడదని పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ రత్నకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎంపీడీవో జీ కాశయ్యతో, ఉద్యోగులతో మాట్లాడారు కమిషనర్ సూచించిన విధంగా నాలుగో తరగతి ఉద్యోగులకు నిబంధనల ప్రకారమే విధులను కేటాయించాలని, ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే యూనియన్ తరఫున పోరాటం చేస్తామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని రత్నకుమార్ అన్నారు.

వాచ్‌మన్‌ను బంధించి ఎలక్ట్రికల్ వస్తువుల అపహరణ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల డంపింగ్ యార్డులో బ్లూప్లానెట్ ఇంటిగ్రేటెడ్ వేస్ట్ సొల్యూషన్‌కు సంబంధించిన ప్లాంట్ (చెత్త నుంచి విద్యుత్ తయారీ) కొనసాగుతుంది. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని నలుగురు డంపింగ్ యార్డు ఆఫీసు రూమ్ వద్ద కాపలా ఉన్న వాచ్‌మన్ పీ శ్రీనివాసరావుపై దాడిచేసి కాళ్లు, చేతులు కట్టివేసి నోట్లో రాయిపెట్టి బంధించడమే కాకుండా అరిచి గొడవ చేస్తే చంపుతామని బెదిరించారు. అనంతరం ప్లాంట్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో ఉన్న కాపర్ వైరును దొంగిలించారని మంగళవారం సూపర్‌వైజర్ పి.మణికంఠకు సమాచారం అందించడంతో ప్లాంట్ ఇన్‌చార్జ్ భరత్‌భూషణ్, కమిషనర్ శ్రీధర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలి

రెంటచింతల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మొదటి ప్రాధాన్య ఓటు తో గెలిపించాలని సీపీఎం నేతలు కోరారు. మంగళవారం వివిధ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగేశ్వరరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

1.Sadineni Venkatramaiah (Old Name), F/o. **Sadineni Mallaiah.** Resident of D.No. 3-27 Pulipadu (Post), Gurazala (M), Palnadu (Dist.), Pin: 522 415, A.P. I have Changed my name as Sadineni Venkata Ramaiah (New Name) F/o. Sadineni Mallaiah. Here after my home is known as **Sadineni Venkata Ramaiah** (New Name) F/o. **Sadineni Mallaiah.**



పరీక్షలు సరే.. కళ్లజోళ్లేవి?

● ఉమ్మడి జిల్లాలో 38వేల మంది విద్యార్థులకు కంటి సమస్యలు ● 5,186 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అవసరం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ కంటి సమస్యలతో బాధ పడుతున్న విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీపై ప్రభుత్వం స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది సెప్టెంబరులోనే దాదాపు 38వేల మంది విద్యార్థులకు తొలిదశ కంటి పరీక్షలు పూర్తి అయ్యాయి. అయితే వారిలో కళ్లజోళ్ల అవసరం అయిన విద్యార్థుల డేటా ఇప్పటికే జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రభుత్వానికి సమర్పించినా ఇప్పటి వరకు కళ్లజోళ్ల పంపిణీపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కంటి సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు (విద్య),ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల్లో దాదాపు 6.75లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇందులో అనేక మంది పౌష్టికాహార లోపం వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారు లకు ఆదేశాలు జారీ చేసింది. తొలివిడతలో గతేడాది సెప్టెంబరు నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లాలోని 1188 పాఠశాలల్లో 3.08 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దాదాపు 38,008 మంది విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు గు ర్తించారు. వీరిలో తప్పనిసరిగా కళ్లజోళ్ల అవసరమైన వి ద్యార్థులు 5,186 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వర లో కళ్లజోళ్ల పంపిణీ చేయడానికి జిల్లా అంధత్వనివారణ, సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గుర్తింపు ఇలా....

పాఠశాలల్లో కంటి సమస్యలతో ఇబ్బందులు పడే విద్యా ర్థులను గుర్తించడానికి సైన్స్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఇతర వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి కొ న్ని పరికరాలు అందజేశారు. సమస్యలు గుర్తించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు. 600 మందికిపైగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ అందించారు. వారు సైతం పరీక్షలు నిర్వహించి డేటాను ప్రభుత్వానికి సమర్పించారు.

కంటి సమస్యలకు ప్రధాన కారణాలు

దృష్టి లోపానికి ప్రధానంగా ఆరు కారణాలను వైద్యులు చెబుతున్నారు. కంటికి దెబ్బ లేదా గాయం ఏర్పడడం, పోషకాహార లోపం, అంటు వ్యాధులు, రసాయనిక చర్య అంటే కంట్లో హానికర మైన ద్రవాలు, రంగులు పడడం, వంశపారపర్యం, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్ సమస్యలు ప్రధాన కారణాలని కంటి వైద్యులు చెబుతున్నారు. మరోవైపు ఇటీవల కాలంలో పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం కూడా విద్యార్థుల కంటి సమస్యలకు కారణమౌతుందని చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అత్యధిక మంది పౌష్టికాహార లోపం, వంశపారంపర్య కారణాల వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కంటి వైద్యు లు చెబుతున్నారు. ప్రాథమిక స్థాయిలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోకుంటే భావిపౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు (పాత చిత్రం)

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులు

ఇండో -ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టెన్

వికసిత్ భారత్‌కు ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వెల్లడి

నకరికల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత దేశం కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఇండో - ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టెన్ తెలిపారు. ప్రపంచంలో భారతదేశ రైతులకు ఒక ప్రత్యేక స్థానం



గుండ్లపల్లిలోని ఇండో - ఇజ్రాయేలు ప్రాజెక్టు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనాలను పరిశీలిస్తున్న ఇండో - ఇజ్రాయేలు వ్యవసాయ ప్రతినిధి యూరీ రూబీన్ స్టెన్

ఉందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండో - ఇజ్రాయేలు భవన నిర్మాణాలను పరిశీలించారు. పాలిహౌస్, షేడ్ నెట్, పాలి టన్నెల్ నిర్మాణాలకు స్థలాన్ని పరిశీలించి, నిర్మాణంలో తీసుకోవలసిన చర్యల గురించి ఇంజనీరింగ్, ఉద్యానవన శాఖ అధికారులకు యూరీ రూబీన్ స్టెన్ దిశా నిర్దేశం చేశారు. రూ. 5.06 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల సాయిల్ వాటర్ ఎనాలసిస్ ప్రయోగశాల, పరిపాలన భవనాలను శిక్షణ పొందే రైతుల కోసం ఏర్పాటు చేసిన హాస్టల్ బ్లాక్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఇండో - ఇజ్రాయేలు ప్రాజెక్టు ద్వారా రైతులకు ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రానున్నదని, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను రైతులు పండించే అవకాశం కలుగుతుందని యూరీ రూబీన్ స్టెన్ తెలిపారు. విజన్ 2047 అమల్లో భాగంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ముందు చూపుతో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేసి అమలు చేస్తున్నారన్నారు. రెండు దేశాల భాగస్వామ్యంతో వ్యవసాయ రంగం కొంత పుంతలు తొక్కే అవకాశం ఉందని, రైతులు సమగ్ర అభివృద్ధి సాధించటానికి ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుందన్నారు. స్థానిక రైతులతో కలసి ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి రావటంతో అటు రాష్ట్రానికి, దేశానికి మంచి వ్యవసాయ విజ్ఞాన కేంద్రంగా వెలుగొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవమునిరెడ్డి, జిల్లా ఉద్యాన వన శాఖ సీహెచ్‌వీ రమణారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ గుంటూరు జిల్లా ఎస్ఈ జీ బ్రహ్మయ్య, సుబ్బ రాయుడు, ఏపీఎంఐపీ పీడీ వీరాంజనేయులు, టెక్నికల్ అధికారి అశోక్‌రెడ్డి, తహసీల్దార్ కే పుల్లారావు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

సుస్థిర విద్యతోనే.. సమసమాజ స్థాపన

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రామరాజు

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సుస్థిర విద్యయే సమస మాజ స్థాపనకు శ్రేయస్కరం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వీ రామరాజు అన్నారు. సీపీఆర్ ఈఈసీ సీఎస్ఈ, విప్రోయెర్తెన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బైపాస్ రోడ్డులోని సీఎస్ఈ మీటింగ్ హాల్‌లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. సుస్థిర విద్యపై ప్రతి ఒక్క రూ దృష్టి సారించాలని అన్నారు. పాఠశాలల్లో సుస్థిర విద్యా విధానాలపై, నీరు, జీవ వైవిధ్యం, చెత్త యాజమాన్యంపై రాష్ట్ర వ్యాప్తంగా 304 పాఠశాలలకు శిక్షణ ఇవ్వగా 80 పాఠశాలలు తమ ప్రాజెక్టులను సమర్పించాయి. 18 ప్రాజెక్టులను జాతీయ స్థాయికి రికమండ్ చేయగా అందులో ఏపీ మోడల్, మహానంది (నంద్యాల జిల్లా), ఎంజేపీఏపీ బీసీఆర్, ఈఐఎస్ కలగిరి (అన్నమయ్య జిల్లా) ప్రాజెక్టులు జాతీ యస్థాయికి ఎంపికై రూ.50వేల నగదు బహుమతు లను గెలుచుకున్నాయి. జడ్పీ హెచ్ మల్లవోలు (కృష్ణా జిల్లా), జడ్పీహెచ్, చెట్టుపల్లి (అనకాపల్లి జిల్లా), అరవింద కుంచనపల్లి (గుంటూరు జిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం వీరపనేని గూడెం (కృష్ణాజిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం (ఆచంట), పెనుగొండ ప్రాజెక్టులు రూ.10వేల బహుమతులు గెలుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాల అవనిగడ్డ (కృష్ణా జిల్లా), మోడల్ స్కూల్, కారంపూడి గురుకులం, సర్వేపల్లి (నెల్లూరు జిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం (పల్నాడు జిల్లా), ఆచంట పశ్చిమగోదావరి జిల్లా, అరవింద మోడల్ స్కూల్ మంగళగిరి (గుంటూరు జిల్లా), ఎంజేపీఏ పీబీసీ, ఆర్ఈఐఎస్ సింహాచలం (విశాఖ), శ్రీ గురురాజ ఇంగ్లీష మీడియం స్కూల్ (నంద్యాల), డాక్టర్ అంబేద్కర్ గురుకులం జగ్గయ్యపేట (ఎన్టీఆర్ జిల్లా), డాక్టర్ అంబేద్కర్ గురుకులం నూజివీడు (కృష్ణా జిల్లా) పాఠశాలల మొత్తం 18 బృందాలను అభినం దించి రామరాజు సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్య అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీమతి విజయదుర్గ, పలువురు జాయింట్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో బెంగుళూరులో జరిగే కార్యక్రమంలో జాతీయ విజేతలైన రెండు బృందాలకు రూ.50వేల నగదు విప్రో సంస్థ బహూకరిస్తుందని ప్రాజెక్టు కోఆర్డినేట్ డైరెక్టర్ వెంకటరత్నం తెలిపారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ రామరాజు

అబద్ధాలు చెప్పడంలో జగన్ పీహెచ్‌డీ

-మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అబద్ధాలను కూడా కాన్ఫిడెంట్‌గా చెప్ప డంలో జగన్మోహన్‌రెడ్డి పీహెచ్‌డీ చేశారని, గన్నవరంలో టీడీపీ కార్యాలయం దాడిపై జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారు అనే భ్రమలోంచి ఇకనైనా జగన్ బయటకు రావాలని ఆయన అన్నారు. దళిత ఉద్యోగి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి హింసించి, హత్య చేస్తానని బెదిరించిన వైసీపీ నేత వంశీని విజయవాడ జైలులో పరామర్శించిన జగన్, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలు జరిగినప్పుడు ఏం చేశారని నిలదీశారు. ఒక దుర్మార్గుడిని పరామర్శించడానికి జైలుకు వెళ్లిన జగన్మోహన్‌రెడ్డి, అక్కడ కూడా కులాల గురించి మాట్లాడటం నీచాతి నీచమన్నారు. మనిషి అనే వాడు చేయని దుర్మార్గాలు వల్లభనేని వంశీ చేయబట్టే నేడు జైల్లో ఉన్నాడని చెప్పారు. రౌడీలు, గుండాలకు వత్తాసు పలుకుతున్న జగన్, నేరస్థులకు మద్దతిస్తూ పోలీసుల బట్టలు విప్పుతీస్తాం అంటూ మీడియా ముందు రంకెలు వేయడం చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి భారీగా కేటాయింపులు

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతోనే సాధ్యం ◆ చర్చాగోష్ఠిలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాబడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా కేటాయింపులు జరిగినట్లు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కేంద్రబడ్జెట్‌పై స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం మేధావులతో చర్చాగోష్ఠి జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుప తిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వలనే కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక కేటాయింపులు సాధ్యమయ్యాయన్నారు. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని అందుకు అనుగుణంగానే బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ప్రధాని మోదీతోనే వికసిత భారత్ సాధ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి రూ2,50,000 కంటే మించిన ఆదాయంపై పన్ను వసూలు చేసిందన్నారు. మోదీ ప్రభు త్వం 12 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను సడలింపు చేసిందన్నారు. దీనివల్ల కేంద్రానికి పన్నుల రూపంలో రూ.1.04 లక్షల కోట్ల ఆదాయం తగ్గుతున్నా మధ్యతరగతివర్గాల శ్రేయస్సు కోరి మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రైతులకు అండగా ఉండేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులపై రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం పెం చడం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగాలు కాకుండా స్టార్టప్‌ల ద్వారా నిధులు కేటాయిస్తుందని, ఒక్కో యూనిట్‌కు రూ.10 కోట్లకు రుణాలను పెంచినట్లు తెలిపారు. 100 జిల్లాల్లో పీఎం ధన ధాన్య యోజన కింద రైతుల కోసం 1.7 కోట్ల మందితో ప్రయోగాత్మక పథకం ఏర్పాటు చేశామన్నారు. దీని వల్ల రైతుకు విత్తనం నుంచి పంట పండిన తర్వాత మార్కెటింగ్ సదుపాయం కల్పించేంత వరకు కేంద్రం అండగా నిలుస్తుందన్నారు.

అమరావతికి ప్రత్యేక నిధులు..

బడ్జెట్‌లో గత వైసీపీ పాలనలో లేనివిధంగా అమరావతి, పోలవరం ప్రాజెక్టుకి ప్రత్యేక నిధులు కేటాయించామన్నారు. గతంలోనే అమరావతిని స్మార్ట్ సిటీగా ప్రకటించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు దశల వారీగా నిధులు కేటాయించామన్నారు. విశాఖ పోర్టుకి రూ.730 కోట్లు కేటాయింప చేశారన్నారు. గత 5 ఏళ్లలో రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తద్వారా రాష్ట్రాన్ని అనాథాంధ్ర ప్రదేశ్‌గా తయారు చేశారన్నారు. నేడు చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి దిశగా ప్రాజెక్టులు, పెట్టుబడులను తీసుకు వస్తున్నారన్నారు. బడ్జెట్‌కి ముందు సీఎం స్వయంగా కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి సమస్యలను వివరించి పెద్దమొత్తంలో నిధులు రాబట్టగలిగారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, గళ్లా మాధవి, ఎండీ నసీర్ అహ్మద్, బూర్ల రామంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జాతీయకౌన్సిల్ మెంబర్ జూపూడి రంగరాజు, మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణ, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, చందు సాంబశివరావు, ఈదర శ్రీనివాస్‌రెడ్డి, యడ్లపాటి స్వరూపరాణి, కొక్కెర శ్రీనివాసరావు, పాలపాటి రవికుమార్, కొత్తూరి వెంకట సుబ్బారావు, నేరెళ్ల మాధవరావు, చరక కుమార్‌గౌడ్, వై.వి.సుబ్బారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌పై చర్చాగోష్ఠిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, మాధవి తదితరులు

కృష్ణబాబు చెబితే.. మాకేంటి!

● ఆరోగ్య శాఖలో అడ్డగోలు డిప్యుటేషన్లు ● ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలకు పాతర ● పని ఉన్న చోట నుంచి తెచ్చి పని లేని చోట ఉద్యోగం ● వైసీపీ నేతల సిఫార్సుతో వచ్చిన వారిని అదే చోట ఉంచారు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్ అంటే రోగుల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. అటువంటి చోట ఉద్యోగులకు పని ఎక్కువగా ఉంటుంది. అక్కడ పనిచేస్తున్న ఒక ఫార్మసిస్ట్‌ను తీసుకువచ్చి బొత్తిగా పనిలేని జిల్లా కార్యాలయంలో ఉంచారు. అదేమంటే అప్పట్లో ఎవరో వైసీపీ నేత చెప్పాడని డిప్యూటేషన్ వేసినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం మారినా సదరు ఉద్యోగి డిప్యుటేషన్ అంతే కొనసాగుతూనే ఉంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఇలా అక్రమ డిప్యుటేషన్ల దందా నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఆరోగ్యశాఖ ఉద్యోగులు గ్రామీణ ప్రాంతాల్లో ఉంటే ప్రజలకు అంతో ఇంతో మేలు జరుగుతుంది. అధికారులకు మాత్రం అవేవీ పట్టవు. గ్రామాల్లో సిబ్బంది కొరతగా ఉన్నా అక్కడ పనిచేసే వారిని అసలు పనేలేని జిల్లా కార్యాలయంలో నియమిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

ప్రిన్సిపల్ సెక్రటరీ చెప్పినా...


వైద్యఆరోగ్యశాఖలోని అన్ని డిప్యుటేషన్లు రద్దు చేయమని ప్రిన్సిపల్ సెక్రటరి కృష్ణబాబు ఆదేశాలు జారీచేశారు. గత ఏడాది ఏప్రిల్‌లోనే ఈ ఆదేశాలు జిల్లా కార్యాలయానికి అందాయి. అప్పట్లో కొద్ది మందిని జీతం తీసుకుంటున్న ప్రదేశానికి పంపివేశారు. కొంతమందిని మాత్రం వివిధ కారణాలతో డిప్యుటేషన్ వేసిన స్థానంలోనే కొనసాగించారు. జిల్లా కార్యాలయంలో సిబ్బంది కొరత పేరుతో ఆరోగ్య పర్యవేక్షకులను డిప్యుటేషన్లు వేయటం వివాదాస్పద మవుతుంది.

ఎన్నో ఏళ్లుగా అక్కడే...

వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో ఒక హెల్త్ సూపర్వైజర్ పని చేస్తున్నారు. వాస్తవానికి సదరు సూపర్వైజర్ వేరే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీతం తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయన అక్కడే వుంటున్నారు. అదేమనంటే ఇమ్యునైజేషన్ విభాగంలో సిబ్బంది కొరత అని చెబుతున్నారు. ఇదే విభాగంలో మరో సూపర్వైజర్‌హెల్త్ అసిస్టెంట్ కూడా పనిచేస్తున్నారు. వీరంతా వేరే చోట జీతాలు తీసుకుంటూ కడుపులో నీళ్ల కదలకుండా జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

వైసీపీ వాళ్లు చెప్పారని...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో చాలామంది ఉద్యోగులు డిప్యుటేషన్ల మీద కొనసాగుతున్నారు. వారంతా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నేతల సిఫార్సు తో అక్కడకు వచ్చిన వారే. ప్రభుత్వం మారినా ఉద్యోగులు మాత్రం అదే స్థానంలో కొనసాగుతున్నారు. ఉదాహరణకు పెదనందిపాడు ఆరోగ్య కేంద్రంలో అసలు డీఈవో పోస్టు లేదు. అక్కడ ఉన్న వైసీపీ నేత ఒత్తిడితో గుంటూరు అర్బన్‌లో పనిచేస్తున్న ఉద్యోగిని పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నియమించారు. ప్రిన్సిపల్ సెక్రటరి కృష్ణబాబు ఆదేశాలు జారీచేసిన తర్వాత కూడా వాళ్లను యథాస్థానానికి పంపకపోవటం గమనార ం. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కూడా కొందరు ఉద్యోగులు ఇదే పద్ధతిలో కొనసాగుతున్నారు.



గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం

పట్టణాలు వదలరు..

ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు సుదీర్ఘ కాలం సర్వీసు పూర్తి చేసినా ఏనాడూ గ్రామీణ ప్రాంతం వెళ్లిన దాఖలాలు లేవు. ఉద్యోగంతో పాటు పట్టణంలో వ్యాపారాలు చేస్తుండటంతో బదిలీ వచ్చినా వెంటనే డిప్యుటేషన్లు వేయించుకుంటున్నారు అన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం జరిగిన హెల్త్ అసిస్టెంట్లు రీ డిప్లాయిమెంట్‌లో కూడా అదే జరిగింది. పట్టణ ప్రాంతాల్లో పనిచేసే హెల్త్ అసిస్టెంట్లు ఒక గ్రూపుగా ఏర్పడి అప్పటి మంత్రి సిఫార్సుతో అనుకూలంగా ఉన్న 40 పోస్టులను బ్లాక్ చేయించారు. సదరు ఉద్యోగులు జాయిన్ అయ్యి 20 సంవత్సరాలు దాటినా పట్టణంలోనే పనిచేస్తూ ఉండటం గమనార్హం. డిప్యుటేషన్ల కోసం జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక లాబీయింగ్ నిరంతరం జరుగుతూనే వుంటుందని వైద్య ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు. అక్రమ డిప్యుటేషన్లపై ఫిర్యాదు చేసేందుకు కొందరు ఉద్యోగులు సిద్ధమయ్యారు.

సాగర్ ఆయకట్టులో వారబందీ అమలుకు నిర్ణయం

కాలువల వారీగా పంటల వివరాలు సేకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కుడి కాలువ ఆయకట్టులో వారబందీ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు కాలువల వారీగా పంటల సాగు.. నీటి సరఫరా అంశా లను పరిశీలిస్తున్నారు. నీటి విడుదలపై నియం త్రణ ఏదీ అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జలవనరుల శాఖ సీఈ శ్యాం ప్రసాద్ స్పందించారు. గుంటూరు సీఈ కార్యాలయంలో కుడి కాలువ పరిధిలోని ఈఈలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నీటి సరఫరాపై ఆయన సమీక్షించారు. ఏ కాలువ పరిధిలో ఏఏ పంటలు సాగులో ఉన్నాయి. పంటలకు ఎప్పటి వరకు సాగునీరు అవసరం ఉం ది అన్న అంశాలపై సీఈ నివేదిక అందజేయాలని కోరారు. నీటి సరఫరాను తగ్గించే అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. కాగా కుడి కాలువకు నీటి సరఫరాపై సమీక్షించేందుకు పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు సదరు అధికారులు తెలిపారు. సమావేశానికి ఇంజనీర్లు హాజరవుతున్నట్లు చెబుతున్నారు. సమావేశానికి ప్రాజెక్టు కమిటీ.. డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఆహ్వానించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కుడి కాలువకు నీటి సరఫరాపై నిర్వహించే సమావేశంలో సదరు కమిటీలను భాగస్వాములను చేయడంలేదన్న వాదన వినిపిస్తోంది.

బొల్లాపల్లి ప్రజల దాహార్తిని తీర్చాలి: కోట నాయక్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నీటి ఎద్దడితో అల్లాడుతున్న బొల్లాపల్లి ప్రజల దాహార్తిని తీర్చాలని టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు వీ కోటనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటనాయక్ మాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలోని తండాలలో, గ్రామాలలో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వరికపుడిశల ప్రాజెక్టును ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11226, 99854 11220
99852 07026

శివరాత్రికి ఏర్పాట్లు ముమ్మరం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నరసరావుపేట పట్టణంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారిలోని డివైడర్లకు వేస్తున్న రంగులు, రహదారి వెంట ఉన్న ఆక్రమణలు తొలగించడం, సెంట్రల్ లైటింగ్ తదితర ఏర్పాట్లను మంగళవారం అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ వినుకొండ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్‌లో సోర్స్ సెగ్రిగేషన్ అవేర్నెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ ఆదేశాల మేరకు మూడు డబ్బాల వాడకం గురించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, వ్యక్తిత్వ వికాసం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఫేస్ వాష్ అండ్ గో'

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి), జిల్లా ఎస్పీ కంచిశ్రీనివాసరావు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలో రహదారులపై రోడ్డు ప్రమాదాలు నివారణకు ఫేస్ అండ్ గో కార్యక్రమం చేపట్టారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా పోలీసు అధికారులు తమ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక లారీలు, బస్సులు, వ్యాన్లు, వాహనాలు డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారు.

వరికపూడిశెలకు నిధులు కేటాయించాలి: పీడీఎం

వినుకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండల ప్రజల దాహార్తి తీర్చడానికి ముఖ్యమైన వరికపూడిశల ప్రాజెక్టు నిర్మాణానికి రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు కోరారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి నాయకులు నిలబెట్టుకోవాలన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో అత్యుత్తమ సేవలు

● డీసీహెచ్ఎస్ బీవీ రంగారావు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రశంసనీయమైన సేవలను అందిస్తున్నామని హాస్పిటల్ సర్వీసెస్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ బీవీ రంగారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలు మాచర్ల, వినుకొండ, అమరావతి, ఈపూరు, పెదకూరపాడు, గురజాల వీపీ సౌత్‌లలో ఉన్న ఏడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లతోపాటు అన్ని వైద్యశాలలు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోకి వస్తాయన్నారు. ఈ వైద్య సంస్థలు విస్తృత శ్రేణి మందులు, అన్నిరకాల క్లినికల్ లేబరేటరీ ఎక్సరే సేవలను అందిస్తున్నాయన్నారు. క్రమం తప్పకుండా జూమ్ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ డైరెక్టర్ డాక్టర్ సిరి ఈ సేవలను సమర్థవంతంగా ప్రజలకు అందించడానికి కృషి చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ పల్నాడు జిల్లాలో మందులు, పరికరాలు లభ్యతను చురుకుగా పర్యవేక్షిస్తున్నారన్నారు. అవసరమైన ఔషధాలు సేకరణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించారన్నారు.

హెల్పర్‌ని నియమించరూ

● విద్యుత్ ఏఈకి గ్రామస్థుల వినతి

కారుమంచి (శావల్యాపురం) ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి గ్రామానికి విద్యుత్ హెల్పర్‌ను నియమించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు శావల్యాపురం సబ్‌స్టేషన్ ఏఈ నటరాజ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు నెలలగా విద్యుత్ హెల్పర్ లేక సేవల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

శావల్యాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సురేష్

శావల్యాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం మండలం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సురేష్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత వ్యక్తిగత కారణాలతో నెలరోజులు సెలవు పెట్టడంతో వినుకొండ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సురేష్‌ను ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు.

పశుగణనను పరిశీలించిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

రొంపిచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజోతి): మండలంలోని పలు గ్రామాల్లో పశుగణన కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కే.కాంతారావు మంగళవారం పరిశీలించారు. అన్నవరం, రామిరెడ్డిపాలెం, బుచ్చిపాపన్నపాలెం, ఆరేపల్లి, గోగులపాడు, కొనకంచివారిపాలెం గ్రామాల్లో తనిఖీ చేశారు. కార్యక్రమంలో కర్లకుంట పశు వైద్యాధికారి ఆవుల సాయి మహేష్‌రెడ్డి, ఆయా గ్రామాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాల్లా జగనన్న కాలనీలు



మతుకుమల్లిలో పంట పొలంలా మారిన జగనన్న కాలనీ

- స్థలాలు మాకొద్దని తిరస్కరిస్తున్న లబ్ధిదారులు
- కొందరికి ఇచ్చిన స్థలాలు ఎక్కడో తెలియని స్థితి
- అప్పట్లో లబ్ధిదారులకు బలవంతపు రిజిస్ట్రేషన్లు
- సొంతపార్టీ నేతలకు, వలంటీర్లకూ స్థలాలు
- వెలికిచూస్తున్న అవినీతి, అక్రమాలు

శావల్యాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని, ఏకంగా కాలనీలు, ఊళ్ళనే నిర్మించబోతున్నామని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పేదలకు స్థలాలు మాత్రమే ఇచ్చి గృహనిర్మాణాలు చేయించకపోవడంతో గ్రామాల్లో జగనన్న కాలనీలు ప్రజాదరణ కోల్పోయి నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు నివాసం కోసం వాగులు, వంకలు, చెరువులు, శ్మశానవాటికల పక్కన, ఊరికి ఆమడ దూరంలోని ప్రభుత్వ భూములు, పొలాలు, పల్లపు ప్రాంతాలలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడంతో వాటిలో ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. స్థలాలు ఇచ్చిన లబ్ధిదారులకు మూడేళ్ళు గడిచినా గృహ నిర్మాణాలు చేయించకపోవడంతో జగనన్న కాలనీల్లో పిచ్చిచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. కొందరు లబ్ధిదారులకు తమకు కేటాయించిన స్థలమెక్కడో కూడా అధికారులు తెలియజేయకపోవడంతో లబ్ధిదారుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాలలో వైసీపీ నేతలు జగనన్న కాలనీల్లో పాతిన హద్దురాళ్ళను పీకేసి పంటలను, పశుగ్రాసాన్ని సాగు చేస్తున్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లకు జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించారని, సొంత ఇళ్ళుండి ప్రభుత్వానికి ఇంటిపన్నులు కడుతున్న వారికి కూడా జగనన్న కాలనీల్లో స్థలాలను కేటాయించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగనన్న కాలనీలకు భూములు కొనేప్పుడు కొన్ని గ్రామాల్లో వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై రైతుల వద్ద తక్కువ ధరలకు భూములు కొని ఎక్కువ ధరలకు ప్రభుత్వానికి అంటగట్టారన్న విమర్శలున్నాయి. జగనన్న కాలనీల్లో హద్దురాళ్ళు పాతిన కూలీల వేతనాలు, రోడ్లకు, స్థలాలు మెరక లేపేందుకు మట్టితోలకం వంటి అభివృద్ధి పనులు చేసిన కొందరు వైసీపీ నేతలకు కూడా బిల్లులివ్వక వారు ఆర్థికంగా నష్టపోయి జగనన్న కాలనీలపై అసంతృప్తిగా ఉన్నారు.

శావల్యాపురం మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 1610మందిని నివేశన స్థలాలకు రెవెన్యూ అధికారులు అర్హులుగా గుర్తించగా ఈకేవైసీ, ఇతరత్రా సమస్యల కారణంగా వారిలో 1481మందికి మాత్రమే ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. వారిలో 1419మందికి స్థలాలు రిజిస్ట్రేషన్ చేశారు. కానీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయలేదు. మండలంలో మొత్తం 24చోట్ల రెవెన్యూ అధికారులు లేఅవుట్‌లు ఏర్పాటుచేసి లబ్ధిదారులకు స్థలాలను కేటాయించారు. మతుకుమల్లిలో కొందరు టీడీపీ సీనియర్ నేతలు గతంలో ఎస్సీ కాలనీ వాసులకు నివేశన స్థలాలు పంపిణీ చేసేందుకు ఐదు ఎకరాల పొలాన్ని సొంత ఖర్చులతో కొనుగోలు చేసి ప్రభుత్వానికి విరాళంగా సమర్పించారు. ప్రభుత్వం దానిలో 3.5ఎకరాల్లో ఎస్సీలకు ఇళ్ళ పట్టాలు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక మిగులు భూమిని ఓసీ, బీసీలకు పంపిణీ చేసేందుకు సిద్ధమవ్వడంతో ఎస్సీ కాలనీవాసులు దాన్ని వ్యతిరేకించారు. లేఅవుట్ ప్రారంభోత్సవానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుని వారు అడ్డుకోవడంతో లేఅవుట్‌ను ప్రారంభించకుండానే ఆయన వెనుదిరిగారు. పిచికలపాలెం, బొందిలిపాలెం, వేల్పూరు గ్రామాల్లో కూడా ఎస్సీ, బీసీ, ఓసీలకు స్థలాల కేటాయింపుల్లో స్వల్ప వివాదాలు చోటు చేసుకొన్నాయి. వేల్పూరులో ఎస్సీ కాలనీవాసులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని వారు తిరస్కరించడంతో దాన్ని వదిలేసి మరో భూమిని కొనుగోలు చేశారు. కానీ పాత భూమిని అమ్మి నగదు జమచేస్తేనే కొత్తభూమికి నగదు చెల్లిస్తామని అధికారులు తెగేసి చెప్పడంతో ఎస్సీ కాలనీవాసులకు స్థలాల పంపిణీ నిలిచిపోయింది. కారుమంచిలో జగనన్న కాలనీ ఊరికి దూరంగా ఉండడంతో లబ్ధిదారులు స్థలాలు తీసుకునేందుకు ఇష్టపడడం లేదు. కానీ రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రభుత్వం అధికారులపై ఒత్తిడిచేసి నూరుశాతం రిజిస్ట్రేషన్లులు పూర్తి చేయాలని లక్ష్యాలను పెట్టడంతో వారు లబ్ధిదారులను మభ్యపెట్టి రిజిస్ట్రేషన్లు చేయించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ కాలనీలు ఏర్పాటుచేసి పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు చొప్పున అర్హత ఉన్న పేదలందరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేసేందుకు జీవో విడుదల చేయడంతో జగనన్న కాలనీల లబ్ధిదారుల్లో ఇంకా నిరాశ పెరిగింది. జగనన్న కాలనీల్లో ఇప్పటివరకు నిర్మాణాలు జరగని స్థలాలు రద్దుచేసి ఎన్టీఆర్ కాలనీల్లో వారికి స్థలాలు కేటాయించాలని ఇప్పటికే కొన్ని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో అర్హత లేకుండానే స్థలాలు పొందిన లబ్ధిదారులను గుర్తించాలని కూటమి ప్రభుత్వం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేయడంతో అక్రమంగా స్థలాలు పొందినవారిలో ఆందోళన నెలకొంది. అనర్హులను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు గ్రామాల్లో తనిఖీలను నిర్వహిస్తున్నారు. రెవెన్యూ అధికారులు అక్రమాలను ఎంతవరకు వెలికితీస్తారో చూడాలి.

చిట్ సభ్యులను మోసం చేశారు

సమావేశంలో సాయి సాధన చిట్‌ఫండ్ బాధితుల ఆవేదన





సమావేశంలో మాట్లాడుతున్న సీ ప్రతాప్, పక్కన చేకూరి సాంబశివరావు, యామని రామారావు, కడియాల రమేష్, రాధాకృష్ణమూర్తి తదితరులు, సమావేశానికి హాజరైన సాయి సాధన చిట్ ఫండ్ బాధితులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిట్ ఫండ్‌లో ఎలాంటి నష్టం లేకపోయినా కావాలనే అధినేత పాలడుగు పుల్లారావు చిట్ సభ్యులను మోసం చేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నరసరావుపేట పట్టణం పాతూరులో ఓ ప్రైవేట్ హాల్‌లో సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గుంటూరు కోర్టులో లొంగిపోయి రిమాండ్‌లో ఉన్న పాలడుగు పుల్లారావును కలిస్తే వడ్డీలకే అంతా కట్టానని చెబుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీకి సుముఖంగా ఉన్నట్లు కనిపించటం లేదని, అయినా నిరుత్సాహ పడాల్సిన పనిలేదన్నారు. కుటుంబ సభ్యులందరిని స్టేషన్‌లో కూర్చోబెట్టి విచారిస్తే అంతా బయటకు వస్తుందన్నారు. చిట్‌ఫండ్‌లో ఎలాంటి నష్టం లేదని, మొదటి, మూడవ పాట కంపెనీ తీసుకుంటుందని, మన డబ్బు వసూలు చేసి మనకు ఇస్తారని, అలాంటప్పుడు నష్టం వచ్చే అవకాశం లేదన్నారు. అదే విధంగా కోట్ల రూపాయలు తీసుకున్నప్పుడు వడ్డీ కట్టాలన్నారు. తెచ్చిన డబ్బు ఇంట్లో ఉంచుకుంటే నష్టం వస్తుందని, కానీ రియల్ ఎస్టేట్‌లో పెట్టారన్నారు. రియల్ ఎస్టేట్‌లో రూ.40లక్షలు పెట్టి కొన్న భూమి కోటి రూపాయలు అయిందన్నారు. అలాంటి సమయంలో నష్టం వచ్చే ప్రసక్తేలేదన్నారు. పోలీసులకు రూ.35 కోట్లకు సంబంధించి మాత్రమే కేసులు పెట్టారని, దీంతో పోలీసులు ఉన్న ఆస్తులు రూ.35 కోట్లుకు ఉన్నాయని, అప్పులకు, ఆస్తులకు సరిపోతుందని భావిస్తున్నారని అన్నారు. బాధితులందరూ ఫిర్యాదు నమోదు చేయించుకోవాలని, ఎలాంటి నష్టం ఉండదని, భయపడాల్సిన పనిలేదన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర రాజకీయ నాయకలు నిజాయితీగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నారని, దానికి బాధితులు చురుకుగా వ్యవహరిస్తే న్యాయం జరుగుతుందన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబుతో పాటు మంత్రి నారా లోకేశ్‌ను కలవాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఇప్పటికే పాలడుగు పుల్లారావు కేసులో వేరే జిల్లాకు చెందిన ఎస్పీ, మరో 12 మంది పోలీస్ అధికారులతో విచారణకు నియమించిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బాధితులందరూ కలిసికట్టుగా ముందుకు వెళ్ళాలని నిర్ణయించారు.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు





ఆలపాటిని గెలిపించాలని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పట్టభద్రులందరూ తమ అమూల్యమైన ఓటువేసి గెలిపించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కోరారు. మంగళవారం ఉదయం వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నరసరావుపేట రోడ్డులోని సాయిబాబా గుడి వాకింగ్ ట్రాక్ వద్ద చీఫ్‌విప్ జీవీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే నరసరావుపేట రోడ్డులోని టీ స్టాల్స్ వద్ద ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనార్దన్, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, బీజేపీ నాయకులు లెనిన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● ఈపూరు: మండలంలోని ముప్పాళ్ళ, ఈపూరు గ్రామాల్లో మంగళవారం టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎన్నికలు ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలన్నారు. ప్రచారంలో సూరే కోటేశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

● శావల్యాపురం: కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా శావల్యాపురం, శానంపూడి గ్రామాల్లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి జీవీ విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, మాజీ మండలాధ్యక్షుడు గడిపూడి విశ్వనాథం, గోరంట్ల హనుమంతరావు, గద్దె వీరమస్తాన్‌రావు, గంటవారిపాలెం డీసీ చైర్మన్ మండలపు వెంకటనారాయణ, టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, తెలుగు యువత చెరుకూరి బాలకృష్ణ, సీనియర్ నేతలు కర్రి పెదఅంజయ్య, కామినేని లక్ష్మీనారాయణ, కాకాని వేణు, ప్రత్తిపాటి కోటిలింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ప్రచారం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి సహకరించాలని కోరారు. ఆలపాటికి మద్దతుగా చైతన్య లిటిల్స్, చైతన్య టెక్నో, శ్రీచైతన్య, నారాయణ జూనియర్ కాలేజీ, మోడ్రన్ గ్రీన్ వ్యాలీ ఉపాధ్యాయులను ప్రత్తిపాటి కలిశారు. వారికి నమూనా బ్యాలెట్‌ను అందచేశారు. నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పోలం రెడ్డి దినేశ్ రెడ్డి, జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, బీజేపీ నాయకులు జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, పట్టణ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి పాల్గొన్నారు.

రాజాపేట స్కూలులో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం రాజాపేటలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో రూ.2.5లక్షల వ్యయంతో రోటరీ ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్వో ప్లాంటును రోటరీ జిల్లా గవర్నర్ కె.శరత్‌చౌదరి మంగళవారం ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ సంయుక్తంగా ఈ ప్లాంట్‌కు నిధులు సమకూర్చారు. కార్యక్రమంలో అతిథులుగా త్రిపురనేని మురళి, కే శ్రీనివాసరావు పాల్గొనగా, జిల్లా మాజీ చైర్మన్ రత్న ప్రభాకర్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వారణాసి శరత్‌కుమార్, కొల్లా సుబ్బారావు సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మన్ పోలిశెట్టి రాఘవయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

న్యాయసేవాధికార సంస్థ సభ్యులకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థకు సభ్యులుగా వ్యవహరించటానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ స్థానిక మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులను మండల న్యాయసేవ అధికారుల సంస్థకు ఈ నెల 25వ తేదీలోపు సమర్పించాలని ప్రకటనలో కోరారు.

చిలకలూరిపేట, యడ్లపాడులకు కొత్త ఎంఈవోలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారి-1గా ఎ.శ్రీనివాసరావు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఆయన సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి-1గా ఉన్నారు. నాదెండ్ల మండల విద్యాశాఖ అధికారి-1గా ఎంవీ నాగరత్నంకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె ప్రస్తుతం యడ్లపాడు మండలం విద్యాశాఖ అధికారి-1 గా చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ రెండు పోస్టులకు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న కె.లక్ష్మి ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆమె సస్పెండ్ అయ్యారు. దీంతో కొత్తవారిని నియమించారు.

వాహనం బోల్తా: నలుగురికి గాయాలు

కావలి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలిలోని ముసునూరు జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన రాజశేఖర్‌తోపాటు 11మంది తుఫాన్ వాహనంలో తిరుమలకు బయలుదేరారు. దర్శనానంతరం సోమవారం రాత్రి 11గంటల సమయంలో తిరుమల నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని ముసునూరు సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో రాజశేఖర్, పద్మావతి, దివ్య, వెంకట్రావులు గాయపడ్డారు. వారిని హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ దాడులు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకావూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 219లో అక్రమంగా పెద్ద ఎత్తున మైనింగ్ జరుగుతుందన్న ఫిర్యాదుపై జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సుమెంట్ అధికారి సూర్యశ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం జిల్లా మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సదరు ప్రదేశంలో అక్రమ మైనింగ్ కోసం వినియోగిస్తున్న ఒక జేసీబీ, రెండు లారీలను (టిప్పర్) స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం జిల్లాకు మైనింగ్ అధికారులకు అప్పగించారు.

ఈశ్వరియా విశ్వవిద్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును సత్కరిస్తున్న విశ్వవిద్యాలయ సిబ్బంది

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరియా విశ్వవిద్యాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనం గా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని విశ్వవిద్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం సేవలను ఎమ్మెల్యే ప్రశంసించారు.

చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలి

● యడ్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో క్యాంపు ● ఎంపీడీవో



అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో హేమలతాదేవి

యడ్లపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళలోపు చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో హేమలతాదేవి సూచించారు. మండల కేంద్రమైన యడ్లపాడు రచ్చబండ సెంటర్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆధార్ క్యాంపును ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు ఆధార్ ఎన్‌రోల్ చేసుకోని 0-5 ఏళ్ళ మధ్య వయస్సు కలిగిన చిన్నారులకోసం ఈ ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.శశికళ, డిజిటల్ అసిస్టెంట్ ప్రసన్న, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ

రొంపిచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, మునమాక సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. రొంపిచర్ల జడ్పీ పాఠశాల, రెడ్డిపాలెంలోని జడ్పీ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. 120 రోజుల అంగన్‌వాడీ వర్కర్ల సర్టిఫికెట్ కోర్సు, జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్‌లు వెంకటేశ్వరరావు, రామయ్య, మల్లికార్జునరావు, హనుమంతరావులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శశిదేవి, దేవిబాయి పాల్గొన్నారు.

● శావల్యాపురం: అంగనవాడీ కేంద్రాల్లోని పిల్లలకు అక్షరాలతోపాటు గణితంలో కూడా ప్రావీణ్యాన్ని పొందేలా అంగనవాడీ టీచర్లు శిక్షణ ఇవ్వాలని ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారి అన్నారు. వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 77మంది అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక జడ్పీ పాఠశాల్లో ఎంఈవో-2 లలితాకుమారి ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ముదివర్తి అనూరాధ, సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

రొంపిచర్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజోతి): పొలం కలిగిన రైతులు రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మస్తానమ్మ తెలిపారు. మండలంలోని మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా ఈ సంఖ్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో తమ వివరాలు పొందుపరుచుకోవాలన్నారు. ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబరును తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. డీడీఏ శివకుమారి దాళ్వా వరి సాగులో తీసుకోవాల్సిన మెళకువల గురించి, మిరప పంటలో తామరపురుగు నివారణకు చర్యలను వివరించారు.

వరిలో జింకు లోపంపై రైతులకు అవగాహన

రావిపాడు (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాడులో రైతులు సాగుచేస్తున్న వరి పంటలను పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. వరి పంటలో జింకు లోపం గుర్తించారు. జింకు లోపం నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ 5-7 రోజుల వ్యవధిలో 2 నుంచి 3సార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఉమా రాణి, రైతులు పాల్గొన్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలి

నాదెండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ గణపవరంలో వృత్తి, వ్యాపార దుకాణదారులు పంచాయతీకి ఫీజు చెల్లించి లైసెన్స్‌లు పొందాలని పంచాయతీ కార్యదర్శి మారుతీ బాబు కోరారు. మంగళవారం ఆయన సచివాలయ సిబ్బందితో కలసి గ్రామంలోని దుకాణాలను పరిశీలించి యజమానులకు డిమాండ్ నోటీసులను అందించారు.

మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా చిన్నా

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 18: (ఆంధ్రజ్యోతి) వినుకొండ పట్టణ మాల మహానాడు అధ్యక్షుడిగా రాయని చిన్న సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్ పాల్ మంగళవారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నియోజకవర్గం అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్‌కు కే-రిడ్జి విద్యార్థుల ఎంపిక



క్రికెట్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బర్నబాస్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కే-రిడ్జి ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ మంగళవారం తెలిపారు. సీహెచ్ విన్స్ బీ గౌతమ్‌రెడ్డి, జీ గౌతమ్ ప్రదీప్‌రెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. రాజుపాలెం ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో జరిగిన సీనియర్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 21, 22, 23 తేదీలలో చిత్తూరు జిల్లా తుమ్మకుంటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను పీడీ ఎం.కిషోర్‌బాబు, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, స్కూల్ పీఈటీ మహిత అభినందించారు.

● కరాటే పోటీలలో కే-రిడ్జి విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ తెలిపారు. అద్దంకిలో జరిగిన ఆర్టీ డ్రాగన్స్ షటోకాన్ కరాటే అసోసియేషన్ పోటీలలో కే-రిడ్జి స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. ఆరు రాష్ట్రాలనుంచి 650 మంది పాల్గొన్న ఈ పోటీలలో కే-రిడ్జి విద్యార్థులు ఈ ఘనత సాధించారన్నారు. విద్యార్థులను కోచ్ శివకృష్ణ, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ తదితరులు అభినందించారు.